

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 57 | ఎడిటర్ : బరిగెల శివ | మంగళవారం 27, జనవరి 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# మున్సిపాలిటీ ఎన్నికల కోసమే మరమ్మత్తులు !



## ఓట్ల కోసమే.. కొత్త రోడ్లు..

## డాక్టర్ బరిగెల శివ



**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

మున్సిపాలిటీ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ప్రధాన పట్టణాల్లో కొన్ని కాలనీలలో రోడ్ల మరమ్మత్తులు వేగంగా సాగుతున్నాయి. ఐదేళ్ల కాలంలో ఏనాడూ కానరాని గుంతలు పడ్డ రోడ్లకి నేడు మెరుగులు దిద్దుతున్నారు. నడవడానికి వీలు లేకుండా వాహనదారులకు నరకయాతనగా మారినా దుర్భర స్థితిలో ఉన్న రోడ్లను పట్టించుకోని అధికారులు, నాయకులు ఓట్ల పండుగ సమీపిస్తుండటంతో తమ వైపు చూస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందు నుంచే ప్యాచ్‌వర్క్‌లు,తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టడం వెనుక స్పష్టమైన రాజకీయ ఉద్దేశమే ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.మరి కొన్ని చోట్ల కాంక్రీట్ సీసీ రోడ్లను వేస్తున్నారు.ఎన్నికల సమయంలో మాత్రమే రోడ్లకు 'భాగ్యం' దక్కుతుండటంతో, మిగతా రోజుల్లో ప్రజలు ప్రమాదాల మధ్య ప్రయాణించాల్సి పరుస్థితులు దాపురిస్తున్నాయి.

**నాణ్యతపై అనుమానాలు..**

ఓట్ల దగ్గర పడుతుందటంతో తొందరగా పనులను పూర్తి చేయాలని, రోడ్ల మరమ్మత్తుల్లో నాణ్యత లోపిస్తోందని స్థానికులు చెబుతున్నారు. సరైన బేస్ లేకుండా కేవలం పైపైగా మట్టితో, తారతో ప్యాచ్‌లు వేయడం వల్ల వర్షం పడితే మళ్లీ గుంతలు దర్శనమిస్తున్నాయని, డ్రైనేజీ పూడికలు సరిగ్గా లేకపోవటంతో గతంలో పరిస్థితులు రావచ్చని విమర్శలు వెళు ్లవెత్తుతున్నాయి.

**ఎన్నికల తర్వాత మళ్లీ అదే పరిస్థితి..**

"ఎన్నికల ముందు రోడ్లు బాగు చేస్తారుడ ఎన్నికలు అయిపోగానే వాటి వైపు ఎవరూ చూడరు" అన్న అభిప్రాయం ప్రజల్లో బలంగా నాటుకుపోయింది. కొన్ని ప్రదేశాల్లో మంచినీటి వ్యవస్థను మెరుగుపరచక పోవటంతో కొన్ని మురుగు నీళ్లు దిక్కయ్యాయని గగ్గోలు పోతున్నారు. గత అనుభవాలే ఇందుకు నిదర్శనమని,

- మిగతా 2లో..



డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్




## ఆంక్షల విధింపు ఆదర్శవంతమే

- వాహనాల నెంబర్ ప్లేట్స్ స్టిక్కర్స్ పై కఠిన నిర్ణయం
- ఆన్ గౌడ్ డ్యూటీ అనే బోర్డులను కూడా తొలగించాలి
- ప్రైవేట్ వాహనాలకు పోలీస్ సైరన్ లు వాడితే క్రిమినల్ కేసులు నమోదు చేయాలి
- ప్రభుత్వ అధికారులు అవినీతి అక్రమాస్తులు సంపాదిస్తే ఉద్యోగం నుండి రిమూవ్ చేయాలి
- ఏసీబీ అధికారులకు దొరుకుతున్న ఉద్యోగుల ఆస్తులను ప్రజా సంక్షేమానికి పంచాలి
- తెలంగాణ మీడియా ఆంధ్ర మీడియాను విడదీసి గుర్తింపులు కేటాయించాలి
- ఆంధ్రాలో తెలంగాణ మీడియా లేనేలేదు
- నకిలీ వ్యక్తుల హోదాలు వాహనాల నెంబర్ ప్లేట్లపై కనిపిస్తున్నాయి
- పోలీస్ అధికారుల బంధువులు వాహనాలకు పోలీస్ స్టిక్కర్లు వాడుతున్నారు
- దీనితోనైనా గౌరవంగా బ్రతికే జర్నలిస్టులకు గౌరవం దక్కుతుంది
- నేర చరిత్ర కలిగినోళ్లే అధికారిక వాహనాలను వ్యాపారాల కోసం వాడుతున్నారు : డాక్టర్ బరిగెల శివ



2

## తెలంగాణలో ఘనంగా రిపబ్లిక్ డే వేడుకలు..

- జాతీయ జెండా ఎగరేసిన గవర్నర్
- తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు
- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జెండా ఆవిష్కరించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం, మంత్రులు, స్పీకర్
- అసెంబ్లీ, మండలి, సచివాలయంలోనూ రిపబ్లిక్ డే సంబరాలు

8

## పోలీస్ స్టేషన్లలో రిపోర్టర్ల 'గ్రూప్ అడ్మిన్' పాలన

8

## హార్వర్డ్ యూనివర్సిటీలో విద్యార్థిగా మారిన సీఎం రేవంత్ రెడ్డి

- 'లీడర్‌షిప్ ఇన్ 21వ శతాబ్దం' కోర్సులో చేరిక
- భారీ హిమపాతం, ప్రతికూల వాతావరణంలోనే తరగతులకు హాజరు
- సీఎం అమెరికా పర్యటనపై ప్రతిపక్ష బీజేపీ విమర్శలు
- ప్రజా బాధ్యతల కంటే వ్యక్తిగత ఆకాంక్షలకే ప్రాధాన్యతా? అని ప్రశ్న



2



## వ్యసనంగా మొబైల్ మయాజాలం...?

- దూరమౌతున్న బంధుత్వాలు కరుగుతున్న మమకారాలు
- అమ్మమ్మ, నానమ్మ, తాతయ్య కథలు మాయం..!
- సోషల్ మీడియా వ్యసనం, యువతను మింగేస్తోంది
- అక్రమ సంబంధాలకు మార్గం, సెల్ఫోన్
- భార్యాభర్తల మధ్య చిచ్చు, అనుమానాల పెనుబాటు
- సెల్ఫీ మోజు. ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న యువత
- అనారోగ్యం, మానసిక ఒత్తిడి.. బూతులు, బొమ్మలు, గేమ్స్, విద్యకు దూరం
- చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు సెల్ ఫోన్ స్వర్గమైంది
- ఇకనైనా మేల్కోవాలి..! : రాహుల్ కశ్యప్

2

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE

# మున్సిపాలిటీ ఎన్నికల కోసమే మరమ్మత్తులు!

ప్రతిసారి ఇదే రీతిగా జరుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మొదటి పేజీ తరువాయి



**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఇదే తరహా..**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సమీపిస్తుండటంతో నియోజకవర్గం వర్గంలోని కొన్ని కాలనీలలో రోడ్ల మరమ్మత్తులు దర్శనమిచ్చాయి. ప్రచారంలో ప్రజలను ఆకట్టుకునేందుకు, ఓట్లను తమవైపు మల్లించుకునేం దుకు అధికార పార్టీ కుయక్తులు పన్నుతోందని ప్రతిపక్ష పార్టీలు పెద్ద ఎత్తున మంది పడ్డాయి. ఇదే తరహాలో ఇప్పుడు స్థానిక ఎన్నికల్లో మరమ్మత్తులు ఓట్ల కోసమేనని పెద్ద ఎత్తున విమర్శలు గుప్పుతున్నాయి.

**మార్పుకావాలి..**

రోడ్ల మరమ్మత్తులు ఓట్ల కోసమేనా? ప్రజల భద్రత, సౌకర్యాలు ఎన్నికల రోజులకు మాత్రమే పరిమితమా? అనే ప్రశ్నలు ఇప్పుడు పట్టణాల్లో చర్చనీయాంశంగా మారాయి. శాశ్వత పరిష్కారాల కోసం ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని,ఎన్నికల రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి జరగాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# హార్వర్డ్ యూనివర్సిటీలో విద్యార్థిగా మారిన సీఎం రేవంత్ రెడ్డి

**'లీడర్‌షిప్ ఇన్ 21వ శతాబ్దం' కోర్సులో చేరిక**
**భారీ హిమపాతం, ప్రతికూల వాతావరణంలోనే తరగతులకు హాజరు**
**సీఎం అమెరికా పర్యటనపై ప్రతిపక్ష బీజేపీ విమర్శలు**
**ప్రజా బాధ్యతల కంటే వ్యక్తిగత ఆకాంక్షలకే ప్రాధాన్యతా? అని ప్రశ్న**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీలో తన ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. మసాచుసెట్స్‌లోని కేంబ్రిడ్జ్‌లో ఉన్న కెన్నడీ స్కూల్‌లో 'లీడర్‌షిప్ ఇన్ ది 21వ సెంచరీ: కేయాస్, కాన్‌ఫ్లిక్ట్, అండ్ కరేజ్' అనే కోర్సులో ఆయన చేరారు. ఆదివారం స్థానిక కాలమానం ప్రకారం ప్రోగ్రామ్ ఓరియంటేషన్, సహ విద్యార్థుల పరిచయంతో తరగతులు మొదలయ్యాయని ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తరగతులు జరుగుతున్నాయి. ఈ సమయంలో సీఎం రేవంత్ రెడ్డి వివిధ తరగతులు, కేస్ స్టడీ అనాలిసిస్, కన్సల్టేటివ్ గ్రూప్ వర్క్‌లో పాల్గొంటున్నారు. ఈ కోర్సులో భాగంగా ఆయన ఇతర విద్యార్థులతో కలిసి అసైన్‌మెంట్లు, హోంవర్క్, గ్రూప్ ప్రాజెక్టులు పూర్తి చేయాల్సి ఉంటుంది. జనవరి 30 వరకు ఈ తరగతులు కొనసాగుతాయి. కోర్సు పూర్తయ్యాక రేవంత్ రెడ్డి హార్వర్డ్ నుంచి సర్టిఫికెట్ అందుకుంటారు. స్వతంత్ర భారత చరిత్రలో ఒక ముఖ్యమంత్రి పదవిలో ఉండగా ఐవీ లీగ్ యూనివర్సిటీలో ఇలాంటి కోర్సులో చేరడం ఇదే తొలిసారని సీఎంవో పేర్కొంది. ఐదు ఖండాలకు చెందిన 20కి పైగా దేశాల నుంచి వచ్చిన వారు ఈ తరగతులకు హాజరవుతున్నారు. మరోవైపు, బోస్టన్ ప్రాంతంలో 'ఫెర్న్' అనే మంచు తుపాను కారణంగా అత్యవసర పరిస్థితి నెలకొంది. రెండు అడుగుల మేర హిమపాతం, మైనస్ 20 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇంతటి ప్రతికూల వాతావరణంలోనూ రేవంత్ రెడ్డి తరగతులకు హాజరవుతున్నారు. గత వారం స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సులో పాల్గొన్న అనంతరం ఆయన నేరుగా అమెరికా వెళ్లారు. అయితే, సీఎం రేవంత్ రెడ్డి హార్వర్డ్‌లో కోర్సులో చేరడంపై ప్రతిపక్ష బీజేపీ విమర్శలు గుప్పించింది. నాయకత్వం అనేది స్వల్పకాలిక కోర్సుల ద్వారా కాకుండా, పాలన, జవాబుదారీతనం, క్షేత్రస్థాయిలో ఫలితాల ద్వారా నిరూపించుకోవాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన అధికార ప్రతినిధి ఎన్.వి. సుభాష్ వ్యాఖ్యానించారు. "ఇలాంటి అకడమిక్ కోర్సులను జీవితంలో ముందే పూర్తి చేయాల్సింది కదా?" అని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రికి అసలైన తరగతి గది ఆయన పాలిస్తున్న రాష్ట్రమే కానీ, విదేశీ క్యాంపస్ కాదని ఎద్దేవా చేశారు. ఈ పర్యటన ప్రజా బాధ్యతల కంటే వ్యక్తిగత ఆకాంక్షలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లుగా ఉందని, దీనికి అవుతున్న ఖర్చుపైనా ఆయన సందేహాలు వ్యక్తం చేశారు.

# హనుమకొండలో కకతీయ విశ్వవిద్యాలయ తైక్వాండో సెలెక్షన్స్ విజయవంతం

**క్రీడా స్ఫూర్తిని చాటుతున్న టైక్వాండో క్రీడాకారులు**

**హనుమకొండ, జై భీమ్ న్యూస్ :**



కకతీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన తైక్వాండో సెలెక్షన్స్ హనుమకొండలోని కేయూ ఇండోర్ స్టేడియంలో విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఈ సెలెక్షన్స్‌లో వివిధ కళాశాలల నుంచి వచ్చిన క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ పోటీల్లో హనుమకొండ కాకతీయ డిగ్రీ కాలేజీకి చెందిన ఇద్దరు క్రీడాకారులు వేముల శ్రీఆంష్, ఆడెపు మణికంఠ అద్భుత ప్రదర్శనతో ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ తైక్వాండో గేమ్స్ కు ఎంపికయ్యారు. ఈ జాతీయ స్థాయి పోటీలు మార్చి 16 నుండి 20, 2026 వరకు పంజాబ్ రాష్ట్రంలోని ఐూఎ యూనివర్సిటీ, జలంధర్‌లో జరగనున్నాయి.

**ఎంపికైన క్రీడాకారులు:**

ఆడెపు మణికంఠ అండర్ 68 కిలోల విభాగం

వేముల శ్రీఆంశ్ అండర్ 80 కిలోల విభాగం

ఈ క్రీడాకారులకు చీఫ్ కోచ్ ఎల్లవుల గణేష్ యాదవ్,గౌతమ్ యాదవ్ శిక్షణ అందించారు. ఆయన సమర్థవంతమైన మార్గదర్శకత్వంలోనే ఈ విజయాన్ని సాధించారని తెలిపారు.ఈ సందర్భంగా కోచ్ గౌతమ్ యాదవ్ మాట్లాడుతూ, భవిష్యత్తులో మరెన్నో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని విశ్వాసం వ్యక్తం చేసారు.

# వ్యసనంగా మొబైల్ మయాజాలం ?

**దూరమౌతున్న బంధుత్వాలు కరుగుతున్న మమకారాలు**
**అమ్మమ్మ, నానమ్మ, తాతయ్య కథలు మాయం..!**
**సోషల్ మీడియా వ్యసనం, యువతను మింగేస్తోంది**
**అక్రమ సంబంధాలకు మార్గం, సెల్ఫోన్**
**భార్యాభర్తల మధ్య చిచ్చు, అనుమానాల పెనుబాటు**
**సెల్ఫీ మోజు. ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న యువత**
**అనారోగ్యం, మానసిక ఒత్తిడి**
**బూతులు, బొమ్మలు, గేమ్స్, విద్యకు దూరం**
**చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు సెల్ ఫోన్ స్వర్గమైంది**
**ఇకనైనా మేల్కోవాలి..! : రాహుల్ కశ్యప్**

**హైదరాబాద్ (జై భీమ్ న్యూస్)**

ఒకప్పుడు మనిషి జీవితం మనుషులతో మూడు పువ్వులు ఆరు మాటలు లాగా ఉండేది. ఇప్పుడు అదే జీవితం మొబైల్ మాయతో మూడు మెసేజ్ లు, ఆరు రీల్స్ గా మారిపోయింది. ప్రపంచం అరచేతిలోకి వచ్చిందని ఆనందపడుతున్నారు. కానీ అదే అరచేతి ఇప్పుడు జీవితాన్ని బంధించే సంకెళ్లుగా మారుతోందని తెలుసుకోలేక పోతున్నారు. సెల్ ఫోన్ అనేది అవసరం, కానీ అది ఇప్పుడు వ్యసనంగా మారి కుటుంబాలను చీల్చి చెండాలుతుంది. ఇది నిజం, కళ్ల ముందే జరుగుతున్న పచ్చి నిజం.

**సెల్ఫోన్ వ్యసనంగా మారిందా..?**

పిల్లలకు ఎదిగే వయస్సులో మొబైల్ ఫోన్ లకు దగ్గర చేసి, చదవాల్సిన వయసులో వాళ్ల చేతులకి పుస్తకాలను దూరం చేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. యువత కలలు కనాల్సిన వయసులో వాళ్ల కళ్ల ముందు రీల్స్, షార్ట్ వీడియోలు, గేమ్స్ మాత్రమే తిరుగుతున్నాయి. ఒక్కసారి ఫోన్ తెరిస్తే చాలు గంటలు గడిచిపోతాయి. మళ్ళీ చూసుకుంటే కాలం మారిపోయి ఉంటుంది. కానీ జీవితం మాత్రం ముందుకు వెళ్లడం లేదు. ఇలా మొబైల్ యువతను నెమ్మదిగా లక్ష్యం లేని జీవితానికి నడుపు తుందనటంలో సందేహమేమి లేదు.

**మమా..కారాలు లేని బంధుత్వాలు**

నేడు సమాజంలో మనుషుల తీరు గోడకు కొట్టిన పిడకలు రూపంగా తయారయ్యారని పలువురు విశ్లేషకులు ఎద్దేవా చేస్తున్నారు. నలుగురు కూర్చొని మాట్లాడాల్సిన సమయంలో అందరూ తమ ఫోన్లో మొహం పెట్టి ఉండటం పై విమర్శలు గుప్పిస్తున్నారు. ఒకప్పుడు ఇంట్లో నవ్వులు, కుటుంబంతో మాటలు, కలిసి భోజనాలు, కలిసి సరదాలు, ఇప్పుడు "ఆన్? లైన్".. "స్టేటస్"..., "లైక్స్"..., "ఫాలోవర్స్" ఇలా బంధాలు బలపడాల్సిన చోట బంధాలు తెగిపోతున్నాయి..



**అమ్మమ్మ, నానమ్మ తాతయ్య కథలు మాయం..!**

ఒకప్పుడు పిల్లల్ని పెంచింది అమ్మమ్మ కథలు, తాతయ్య మాటలు, పెద్దల నీతులు. ఇప్పుడు పిల్లల్ని పెంచుతోంది ఎవరు..?యూట్యూబ్, ఇన్స్టాగ్రామ్, గేమ్స్! నిద్రపోయే ముందు "ఒక కథ చెప్పమ్మా" అనాల్సిన పిల్లలూ, "ఫోన్ ఇవ్వండి" అంటున్నారు! ఇది కుటుంబ వ్యవస్థకే ప్రమాదం... మన సంస్కృతి మూలాలకే గండంగా మారింది.

**సోషల్ మీడియా వ్యసనంగా మారి యువతను మింగేస్తోంది**

ఇప్పుడు యువత జీవితం ఇలా తయారైంది. "లైక్స్" కోసం బ్రతుకు, "ఫాలోవర్స్ కోసం ప్రదర్శన, "వైరల్ కోసం వెర్రితనం, రీల్స్ కోసం సమయం వృథా చేస్తున్నారు. "ఎంత చదివావు?" అని అడిగే రోజులు మారి, "ఎంత ఫాలోవర్స్ ఉన్నారు?" అనే స్థాయికి సమాజం మారిపోయింది.

**అక్రమ సంబంధాలకు మార్గం, సెల్ఫోన్...!**

సెల్ఫోన్ పరిచయాలు పెంచుతుంది. కానీ అదే పరిచయాలు కొన్నిచోట్ల కుటుంబాలను పాడుచేస్తున్నాయి. చాట్ ల పేరుతో దగ్గరయ్యే బంధాలు... సమాజంలో చివరకు అక్రమ సంబంధాలుగా మారుతున్న ఘటనలు పెరుగుతున్నాయి. హాయ్ తో మొదలై.., ఒక్క మెసేజ్, ఒక్క కాల్, ఒక్క ఫోటో, ఇలా ఒక ఇంటి గౌరవాన్ని మట్టుబెట్టే స్థాయికి చేరుతోంది.

**సెల్ఫీ మోజు, ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న యువత..**

"ఒక్క ఫోటో" కోసం యువత ప్రాణాలను పణంగా పెడుతోంది. కొండ అంచున, చెరువు గట్టున, ట్రైన్ ట్రాక్ దగ్గర, రోడ్డు మధ్యలో, సెల్ఫీ పేరుతో జల్సాలు చేస్తూ ప్రమాదాన్ని ఆహ్వానిస్తున్నారు. వైరల్ అవ్వాలనే ఆశలో జీవితం మొత్తాన్ని కోల్పోతున్నారు.

**అనారోగ్యం, మానసిక ఒత్తిడి..**

సెల్ఫోన్ ఎక్కువగా వాడటం వల్ల శరీరం, మనసు రెండూ దెబ్బతింటున్నాయి. ఇలా పెరుగుతున్నాయి సమస్యలు కళ్ల నొప్పులు, చూపు తగ్గడం, నిద్రలేమి, మెడ నొప్పి, వెన్ను నొప్పి, చిరాకు, కోపం, ఆందోళన, ఒత్తిడి, ఏకాగ్రత తగ్గడం అవి చిన్న సమస్యలు కాదు. నెమ్మదిగా జీవితాన్ని ఖాళీ చేసే వ్యాధుల బారిన పడుతున్నారు. చదువు కోసం మొబైల్ ఉపయోగించాల్సిన పిల్లలు గేమ్స్ లో మునిగిపోతున్నారు. పరీక్షలు దగ్గర ఉన్నా "ఒక్క రీల్ చూసి చదువుతా" అంటూ గంటల తరబడి సమయం వృథా చేస్తున్నారు. దీంతో చదువు పడిపోతుంది. ఫలితాలు: పడిపోతాయి. భవిష్యత్తు మసకబారుతుంది.

**ఇకనైనా మేల్కోవాలి..!**

సెల్ఫోన్ అవసరమే..., కానీ దానికి బానిసత్వం ప్రమాదం. యువత భవిష్యత్తు కాపాడాలంటే...? రోజుకు స్క్రీన్ టైమ్ తగ్గించాలి. పిల్లలకు ఆటలు-పుస్తకాలు అలవాటు చేయాలి. కుటుంబంతో మాట్లాడే సమయం పెంచాలి. సోషల్ మీడియా ప్రమాదాలపై అవగాహన కల్పించాలి. సెల్ఫీ మోజు తగ్గించాలి

**జాగ్రత్త లేకపోతే బంధాల్ని నరకంలోకి నెట్టేస్తుంది..**

అరచేతిలో స్వర్గం అనుకున్న మొబైల్, జాగ్రత్త లేకపోతే మన బంధాల్ని నరకంలోకి నెట్టేస్తుంది. యువత గమనించాలి, తల్లిదండ్రులు మేల్కోవాలి. సమాజం మారాలి, లేదంటే, మొబైల్ మన చేతిలో ఉండదు. మనమే మొబైల్ చేతిలో ఉంటామని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ఆంక్షల విధింపు ఆదర్శవంతమే

**వాహనాల నెంబర్ ప్లేట్స్ స్టిక్కర్స్ పై కఠిన నిర్ణయం**
**ఆన్ గౌడ్ డ్యూటీ అనే బోర్డులను కూడా తొలగించాలి**
**ప్రైవేట్ వాహనాలకు పోలీస్ సైరన్ లు వాడితే క్రిమినల్ కేసులు నమోదు చేయాలి**
**ప్రభుత్వ అధికారులు అవినీతి అక్రమాస్తులు సంపాదిస్తే ఉద్యోగం నుండి రిమూవ్ చేయాలి**
**ఏసీబీ అధికారులకు దొరుకుతున్న ఉద్యోగుల ఆస్తులను ప్రజా సంక్షేమానికి పంచాలి**
**తెలంగాణ మీడియా ఆంధ్ర మీడియాను విడదీసి గుర్తింపులు కేటాయించాలి**
**ఆంధ్రాలో తెలంగాణ మీడియా లేనేలేదు**
**నకిలీ వ్యక్తుల హోదాలు వాహనాల నెంబర్ ప్లేట్లపై కనిపిస్తున్నాయి**
**పోలీస్ అధికారుల బంధువులు వాహనాలకు పోలీస్ స్టిక్కర్లు వాడుతున్నారు**
**దీనితోనైనా గౌరవంగా బ్రతికే జర్నలిస్టులకు గౌరవం దక్కుతుంది**
**నేర చరిత్ర కలిగినోళ్లే అధికారిక వాహనాలను వ్యాపారాల కోసం వాడుతున్నారు**
**డాక్టర్ బరిగెల శివ**

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

టైం పాస్ కోసం జర్నలిజం చేయడం చాలా ప్రమాదం అని డాక్టర్ బరిగెల శివ అన్నారు.ప్రజాస్వామ్య రక్షణ కోసం పరిపూర్ణమైన త్యాగంతో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు ఫ్రీలాన్స్ జర్నలిస్టులకు ఫుల్ టైం జర్నలిస్టులకు కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ ప్రభుత్వం వాహనాల స్టిక్కర్లపై తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ అభినందించారు.జర్నలిజాన్ని పలచన చేయడం కోసం కొన్ని శక్తులు కంకణం కట్టుకొని వ్యాపారాలకు వాడుకుంటున్నారని అందులో ప్రధానంగా చిట్ఫండ్ సంస్థలు రియల్ ఎస్టేట్ సంస్థలు వ్యాపార రంగ సంస్థలు ప్రైవేట్ వ్యక్తులను జర్నలిజం పేరుతో వాళ్ల వాళ్ల సంస్థలలో పని చేస్తున్న వ్యక్తులను జర్నలిజం ముసుగులో వ్యాపారాలకు రక్షణగా వాడుకుంటూ ప్రభుత్వాలను నిజమైన జర్నలిస్టులను అవమానపరుస్తూ తప్పుతో పట్టిస్తుండడం వల్లనే నిజమైన జర్నలిజం మరుగున పడుతుందని గుర్తుకు చేశారు.రాజకీయ నాయకుల పేర్లతో నంబర్ ప్లేట్ బోర్డులు పెట్టుకుంటున్న వాహనాలపై కూడా చర్యలు చేపట్టాలన్నారు.సర్పంచులు,నకిలీ కార్పొరేటర్లు, ఎంపీటీసీలు, జడ్పిటిసి ల పేర్లతో వాహనాల నెంబర్ ప్లేట్ల పేర్ల మీద అధికార హోదాలంటూ పెట్టుకొని సమాజాన్ని, వ్యవస్థలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ప్రభుత్వానికి గుర్తు చేశారు.రాష్ట్రవ్యాప్తంగా లెక్కలేనంతమంది పోలీస్ అధికారుల బంధువులు కుటుంబ సభ్యులు పదుల సంఖ్యలో వాహనాలకు స్టిక్కర్ బోర్డులు వాడుతున్నారని వాటిని కూడా పరిగణలోకి తీసుకొని చర్యలు చేపట్టాలన్నారు.క్రిమినల్ నేరచరిత్ర కలిగిన వ్యక్తులు సమాజాన్ని శాసించడం కోసం ప్రెస్,పోలీస్, స్టిక్కర్లను వాహనాల నెంబర్ ప్లేట్లపై ఉపయోగిస్తూ దొంగతనాలకు అక్రమ వ్యాపారాలకు తెగబడుతున్నారన్నారు.చాలా చోట్ల నకిలీ ఏసీబీ అధికారులు అంటూ క్రిమినల్స్ దొరకడం వాళ్లపై పోలీస్ శాఖ కఠినమైన చర్యలు తీసుకోవడం రాష్ట్ర చరిత్రలో సంచలనం రేపేందన్నారు.సాదరణ నకిలీ రాజకీయ నాయకులు పార్టీలకతీతంగా పోలీసు వాహనాలకు ఉపయోగించే సైరన్లను వ్యక్తిగత వాహనాలకు ఉపయోగిస్తూ సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు అన్నారు.అదే తరహాలో ప్రభుత్వ ఉద్యోగులుగా కొనసాగుతూ ప్రైవేట్ వ్యాపారాలకు పాల్పడుతూ అక్రమంగా అవినీతిగా ఆదాయానికి మించిన ఆస్తులను సంపాదిస్తున్న ఉద్యోగులను తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖ ఆధ్వర్యంలో ఫైనాన్స్ కమిషనర్ చే గుర్తింపజేస్తూ అలాంటి అవినీతి అక్రమార్కులను ఉద్యోగంలో నుంచి శాశ్వతంగా తొలగించాలని అలాంటి చట్టాన్ని ప్రభుత్వం తీసుకురావడం వల్ల తెలంగాణ ఆస్తులు తెలంగాణ ప్రభుత్వ వ్యవస్థలు సురక్షితంగా పదికాలాలపాటు పదిలంగా ఉండగలవన్నారు.ప్రభుత్వం ద్వారా జీతాలు తీసుకుంటూ పందికొక్కుల్లా లంచాలకు మరిగిన అడ్డమైన వెధవలను ఏ ఒక్కరిని వదలకూడదు అన్నారు.ప్రభుత్వ అధికారులు రాజకీయ వ్యవస్థలకు రాజకీయ పార్టీలకు అనుసంధానంగా వ్యవహరిస్తూ అధికార పదవులలో కొనసాగుతూ ప్రైవేట్ సంస్థల పేర్ల మీద అక్రమంగా చందాలు వసూలు చేస్తూ రాజకీయ నాయకుల పేర్లు చెప్పుకొని ఉన్నతాధికారుల పేర్లు చెప్పుకొని అక్రమ పద్ధతిలో విపరీతమైన సొమ్ము సంపాదిస్తూ ప్రభుత్వ వ్యవస్థలను పూర్తిగా భ్రష్టు పట్టిస్తున్నారన్నారు.ప్రభుత్వం ఇలాంటి కఠినమైన ఆంక్షలు పక్కాగా అమలుపరుస్తున్న సందర్భాల్లో అన్ని వ్యవస్థలకు సమానంగా వర్తింపజేయాలని తెలిపారు.ప్రభుత్వం చేపట్టిన నిర్ణయాన్ని స్వాగతిస్తూనే ఇలాంటి కఠినమైన చట్టాన్ని ప్రభుత్వ వ్యవస్థలపై తీసుకు రాగలిగితే వేల కోట్ల రూపాయలను ఆదా చేయగలిగిన వారు అవుతారన్నారు.ప్రస్తుతం కాంట్రాక్టు పద్ధతులపై జరుగుతున్న వివాదాలు పై స్థాయికి ముదిరిపోయాయని అలాంటివి సంభవించకుండా తగు జాగ్రత్తలు చేపట్టాల్సిన అవసరం ప్రభుత్వంపై ఎంతైనా ఉందన్నారు.తెలంగాణలో ఆంధ్ర మీడియా ప్రభావం సామాన్య జర్నలిస్టులపై కక్షపూరిత దాడులు నిర్వహిస్తుందని దానికి అనుకూలంగా తెలంగాణ ప్రాంత ప్రతినిధులను ఆయా సంస్థలలో ఉద్యోగులుగా కొనసాగించుకుంటూ తెలంగాణపై విషపూరిత దాడులు చేస్తున్నారన్నారు.జర్నలిజం ముసుగులో లెక్కలేనన్ని ఆస్తులు సంపాదించుకొని చివరకు ప్రభుత్వ కాంట్రాక్టు టెండర్లలో పాల్గొనే స్థాయికి ఆంధ్ర మీడియా సంస్థలు తెలంగాణలో ఎదుగుగలిగాయంటే వాటికి పూర్తిగా ప్రభుత్వాల సహకారం ఉన్నందు వల్లే అలాంటివి సాధ్యమవుతున్నాయన్నారు. తెలంగాణేతర మీడియా సంస్థలకు ఐ అండ్ పిఆర్ కమిషనర్ కార్యాలయం నుండి ప్రసార లావాదేవీలకు సంబంధించిన రాయితీలను పూర్తిగా నిలుపుదల చేయాలని దానివల్ల తెలంగాణలో సాధారణ జీవితం గడుపుతున్న జర్నలిస్టులకు మేలు చేసిన వాళ్ళు అవుతారన్నారు.ప్రభుత్వ నిర్ణయాలలో పక్షపాతాలు కొనసాగుతున్నందున స్థానికేతర మీడియా సంస్థలు స్థానికులపై దాడులు చేస్తున్నారని వాటన్నిటిని ప్రధాన మీడియాలుగా చలామణి కొనసాగించడానికి స్థానిక ప్రజాప్రతినిధులే సహకరిస్తున్నారని దానిని ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పరిగణిస్తూ పరిశీలించాల్సిన అవసరం తప్పకుండా ఉందన్నారు.మీడియా సంస్థను క్రమశిక్షణ కలిగిన పద్ధతిగా మార్చడం కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అన్ని ప్రభుత్వ వ్యవస్థలకు వర్తింపజేయాలని కోరారు.మీడియా సంస్థను దుర్వినియోగపరుస్తూ వ్యక్తిగత అభివృద్ధికి అక్రమాస్తుల అభివృద్ధికి వాడుకుంటున్న సంస్థలకు ఇలాంటి నిర్ణయం వల్ల తగిన గుణపాఠం కలుగుతుందన్నారు.రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని తీసుకోబడుతున్న నిర్ణయాలలో ఇలాంటి కఠినతరమైన నిర్ణయం ప్రజాస్వామ్యంపై ఖచ్చితంగా ప్రభావాన్ని చూపిస్తుంది అన్నారు.దళారీల బండారం బయటపడడం కోసం వ్యవస్థలను కఠిన తరం చేయడంలో ప్రథమంగా మీడియా సంస్థ రంగంపై క్రమశిక్షణ కలిగిన మార్పును తీసుకురావడం కోసం చేస్తున్న ప్రయత్నంలో భాగంగా తెలంగాణ మీడియా వ్యవస్థలలో ఫుల్ టైం జర్నలిస్టులుగా పని చేస్తున్న నిరుపేద జర్నలిస్టులను తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకొని తోడ్పాటును అందిస్తూ పెద్దన్న పాత్రను పోషించాల్సిన అవసరం తప్పకుండా ఉందన్నారు.ఇలాంటి నిర్ణయాల వల్ల వ్యవస్థలకే కాకుండా నిజాయితీగా పని చేసే జర్నలిస్టులకు, వ్యక్తులకు అధికారులకు నాయకులకు ప్రజాప్రతినిధులకు ప్రతి ఒక్కరికి గౌరవ మర్యాదలు దక్కుతాయని అందులో భాగంగా అసలు వ్యక్తులు ఎవరో నకిలీ వ్యక్తులు ఎవరో బయటపడగలవన్నారు.

# ఉత్తమ పనితీరుకు గుర్తింపు
# బోయిని రాజుకు బెస్ట్ కలెక్షన్ అవార్డు

**కమలాపూర్, 26 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

రిపబ్లిక్ డే సందర్భంగా 26 జనవరి 2026 న కమలాపూర్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఉత్తమ పనితీరుతో విధులు నిర్వర్తించిన ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏడిఈ వంశీకృష్ణ చేతుల మీదుగా, ఎఈ రాములు సమక్షంలో బోయిని రాజు అన్మాండ్ (ఏజిఏజిఎల్) కు బెస్ట్ కలెక్షన్ అవార్డును ఘనంగా ప్రదానం చేశారు. బోయిని రాజు విధి నిర్వహణలో చూపిన నిబద్ధత, క్రమశిక్షణ, అంకితభావంతో పాటు నిర్దేశిత లక్ష్యాలను మించి ఉత్తమ వసూళ్లు సాధించినందుకు గాను ఈ అవార్డు అందజేసినట్లు అధికారులు తెలిపారు. వినియోగదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ సంస్థ ఆదాయ వృద్ధికి ఆయన చేసిన సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. అదేవిధంగా, కార్యాలయంలో నిరంతర సేవలు అందిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించిన ఉద్యోగులకు బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు కూడా ప్రదానం చేశారు. ఉద్యోగుల కృషిని గుర్తించి ఇలాంటి అవార్డులు ఇవ్వడం వల్ల వారిలో మరింత ఉత్సాహం, పనితీరులో మెరుగుదలతో పాటు బాధ్యతాభావం పెరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఏడిఈ వంశీకృష్ణ మాట్లాడుతూ, అంబాల గ్రామానికి చెందిన బోయిని రాజు వృత్తి నిబద్ధతకు కట్టుబడి పనిచేస్తూ, బిల్లుల వసూళ్ల విషయంలో వినియోగదారులతో కలుపుగోలుగా వ్యవహరిస్తాడని ప్రశంసించారు. అదేవిధంగా ఎఈ రాములు మాట్లాడుతూ, బోయిని రాజు లక్ష్యసాధనలో ముందుండి పనిచేస్తూ, సహోద్యోగులకు మార్గదర్శకంగా నిలుస్తున్నారని తెలిపారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించడం వల్లే ఈ అవార్డు దక్కిందని అన్నారు. ఇంకా లైన్ మెన్ పి. శ్రీనివాస్ మాట్లాడుతూ, బోయిని రాజు ఫీల్డ్ స్థాయిలో సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించే వ్యక్తి అని ప్రశంసించారు. బృందస్ఫూర్తితో పని చేస్తూ, వినియోగదారుల సమస్యలను వేగంగా పరిష్కరించడంలో ఆయన ఎప్పుడూ ముందుంటారని పేర్కొన్నారు. సహోద్యోగులతో సానుకూలంగా వ్యవహరించడం వల్ల అందరిలోనూ ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని అవార్డు గ్రహీతలను హర్షాతిరేకంగా అభినందించారు.




## తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గండికోట వెంకన్న నియామకం



**కాజీపేట, 26 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి ఐలుమల్లు కాజీపేట పట్టణానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త గండికోట వెంకన్న ను సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించారు. ఈ సందర్భంగా సంఘం తరఫున జారీ చేసిన నియామక పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి ఐలుమల్లు గండికోట వెంకన్నకు అధికారికంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన గండికోట వెంకన్న, తనపై నమ్మకంతో రాష్ట్ర ఉపాధ్యక్షుల బాధ్యతలను అప్పగించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి ఐలుమల్లుకు, సంఘం నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. వడ్డెర సంఘం బలోపేతం కోసం, ముఖ్యంగా వెనుకబడిన వడ్డెర కులానికి చెందిన ప్రజల హక్కులు, సంక్షేమం, సామాజిక న్యాయం సాధన కోసం మరింత అంకితభావంతో పని చేస్తానని స్పష్టం చేశారు. తన నియామకానికి కీలకంగా సహకరించిన రాష్ట్ర కార్యదర్శి పల్లపు వెంకటేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లపు మల్లికార్జున్లకు గండికోట వెంకన్న ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, జిల్లాస్థాయిలో సంఘం కార్యక్రమాలను బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలతో కలిసి పనిచేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడిన రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి ఐలుమల్లు, గండికోట వెంకన్న సంఘం పట్ల అంకితభావంతో పనిచేస్తున్న వ్యక్తి అని, కాజీపేట ప్రాంతంలో వడ్డెర సంఘాన్ని బలోపేతం చేయడంలో ఆయన పాత్ర కీలకమని ప్రశంసించారు. వెంకన్న లాంటి నిబద్ధత కలిగిన నాయకుల నియామకం ద్వారా సంఘం మరింత బలోపేతమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పీట్ల మల్లేష్, వడ్డెర సంఘం నాయకులు కంది రాజు, శివరాత్రి శంకర్, మండల ప్రెసిడెంట్ శివరాత్రి కుమార్, గ్రామ శాఖ అధ్యక్షుడుతో పాటు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని గండికోట వెంకన్నను అభినందించారు. కార్యక్రమం హర్షాతిరేకాలు, శుభాకాంక్షల మధ్య ఘనంగా ముగిసింది.

## కాకతీయ విశ్వవిద్యాలయ పరిశోధకులకు వైస్ చాన్సలర్ అవార్డు

**వరంగల్, 26 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**




కాకతీయ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులకు ప్రతిష్ఠాత్మకమైన వైస్‌చాన్సలర్ ఫస్ట్ బెస్ట్ రీసెర్చ్ పేపర్ అవార్డు లభించింది. బయోటెక్నాలజీ రంగంలో విశేష పరిశోధన చేసినందుకు ఈ అవార్డును విశ్వవిద్యాలయం ప్రకటించింది. మహేందర్ పోరిక, రాధిక తిప్పన్నీ, శ్రీరామ్ రేకులపల్లి, సిరిషా కలం, రాజశేఖర్ రెడ్డి పూనూరు, సరంగపాణి మండ, గాబ్రియేల్ క్రిస్టిన్ సారెజ్కి మరియు సదానందం అబ్బగాని బృందం ఈ గౌరవాన్ని దక్కించుకుంది. వీరు రచించిన “హెస్పెరిదిన ఆస్ ఎ పోటెంట్ టెలోమీరాజ్ ఇనహిబైటర్: స్టడీస్ ఆన్ ఇట్స్ ఆంటీక్యాన్సర్ అండ్ ఆంటీ- టెలోమీరాజ్ ఎఫెక్ట్స్ ” అనే పరిశోధనా పత్రం అంతర్జాతీయ స్థాయిలో పేరుగాంచిన ఫుడ్ బయోసైన్స్ జర్నల్‌లో (ఇంపాక్ట్ ఫ్యాక్టర్ 5.9) ప్రచురితమైంది. క్యాన్సర్ నియంత్రణకు సంబంధించిన కీలక అంశాలపై ఈ పరిశోధన ప్రాముఖ్యత కలిగి ఉందని విశ్వవిద్యాలయ అధికారులు తెలిపారు. బయోటెక్నాలజీ రంగంలో కాకతీయ విశ్వవిద్యాలయం చేస్తున్న నాణ్యమైన పరిశోధనలకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను రిజిస్ట్రార్, వైస్ చాన్సలర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సాధనంతో కాకతీయ విశ్వవిద్యాలయ ప్రతిష్ఠ మరింత పెరిగిందని అకడమిక్ వర్గాలు ప్రశంసించాయి.

## శ్రీ భద్రకాళి దేవస్థానంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



**వరంగల్, 26 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ నగరంలోని ప్రసిద్ధ శ్రీ భద్రకాళి దేవస్థానంలో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థాన చైర్మన్ డాక్టర్ శివసుబ్రహ్మణ్యం జాతీయ జెండాను ఆవిష్కరించి ఎగురవేసి దేశభక్తి భావాన్ని చాటారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపిస్తూ రాజ్యాంగ విలువలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, మోతుకూరి మయూరి రామేశ్వర్ రావు, జారతి వెంకటేశ్వర్లు, బింగి సతీష్, పాలడుగుల ఆంజనేయులు పాల్గొని వేడుకలను మరింత శోభాయమానం చేశారు. అలాగే దేవాలయ అర్చకులు, సిబ్బంది సంపూర్ణ సహకారం అందించి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా పెద్ద సంఖ్యలో దేవాలయాన్ని సందర్శించిన భక్తులు జాతీయ జెండాకు గౌరవ వందనం చేసి దేశభక్తి నినాదాలు చేశారు. ఆలయ ప్రాంగణం దేశభక్తి, భక్తిశ్రద్ధలతో మార్మోగింది. ఈ సందర్భంగా దేవస్థాన చైర్మన్ డాక్టర్ శివసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, భారత రాజ్యాంగం మనకు ఇచ్చిన హక్కులు, బాధ్యతలను ప్రతి పౌరుడు గుర్తించి దేశ సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం వంటి రాజ్యాంగ విలువలను పాటిస్తూ ముందుకు సాగినప్పుడే దేశం బలంగా నిలుస్తుందన్నారు. దేశభక్తి నినాదాలు, భక్తిశ్రద్ధల నడుమ గణతంత్ర దినోత్సవ వేడుకలు విజయవంతంగా ముగిశాయి.

# గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ నాగరాజు మృతి

**డ్యూటీలోనే ప్రాణాలు విడిచిన మరో డ్రైవర్**



**హైదరాబాద్, జనవరి 26, 2026 (జై భీమ్ న్యూస్):**

ఆర్టీసీ డ్రైవర్లపై రోజు రోజుకు పెరుగుతున్న పని భారం మరో ప్రాణాన్ని బలిగొంది. డ్రైవర్లు రిటైర్ అవుతున్నా కొత్త రిక్రూట్‌మెంట్ లేకపోవడంతో ఉన్న సిబ్బందిపై అధిక పని ఒత్తిడి పడుతోంది. మానసిక ఒత్తిడి, శారీరక శ్రమ కారణంగా డ్రైవర్లు స్టీరింగ్ పైనే ప్రాణాలు విడిచే పరిస్థితి నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా గత ఆరు నెలల వ్యవధిలో డ్యూటీలో ఉన్న సమయంలోనే గుండెపోటుతో ఐదుగురు ఆర్టీసీ డ్రైవర్లు మృతి చెందగా, మరికొందరు తీవ్ర అస్వస్థతకు గురైనట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ వద్ద హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. హైదరాబాదు నుంచి విజయవాడకు వెళ్తున్న ఏపీఎస్ఆర్టీసీ బస్సు డ్రైవర్ గుండెపోటుతో మృతి చెందాడు. డ్రైవర్‌కు ఛాతిలో తీవ్ర నొప్పి రావడంతో వెంటనే బస్సును రోడ్డు పక్కకు ఆపాడు. ఈ విషయం గమనించిన ప్రయాణికులు అతన్ని ఆటోలో సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ వైద్యులు అందుబాటులో లేరని తెలిపారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడిని విజయవాడ డిపోలో పనిచేస్తున్న గొల్లపూడి ప్రాంతానికి చెందిన నాగరాజు (38)గా గుర్తించారు. నాగరాజుకు భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మియాపూర్ నుంచి అమరావతి మీదుగా విజయవాడకు వెళ్తున్న బస్సులో ఈ విషాద ఘటన చోటుచేసుకోవడం ఆర్టీసీ వర్గాల్లో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. ఆర్టీసీ డ్రైవర్లకు సరైన విశ్రాంతి, ఆరోగ్య పరీక్షలు, సిబ్బంది నియామకాలు చేపట్టాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## పింగిళి మహిళా కళాశాలలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు - ప్రొఫెసర్ చంద్రమౌళి

**హన్మకొండ, 16 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**



వడ్డేపల్లి పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాలలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి అధ్యక్షత వహించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎన్సిసి కాడెట్ల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ చంద్రమౌళి మాట్లాడుతూ, ఒకప్పుడు సూర్యాస్తమించని సామ్రాజ్యంగా భావించబడిన బ్రిటిష్ పాలన నుండి స్వాతంత్ర్యం పొందిన తరువాత గడిచిన 76 సంవత్సరాలలో భారతదేశం శాస్త్ర సాంకేతిక, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో విశేషమైన పురోగతిని సాధించిందన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడుకుంటూ దేశాభివృద్ధికి ప్రతి పౌరుడు తనవంతు బాధ్యత నిర్వర్తించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ క్యాడెట్ కోర్ (ఎన్సిసి), నేషనల్ సర్వీస్ స్కీం (ఎన్ఎస్ఎస్), స్పోర్ట్స్, ఇంగ్లీష్ విభాగాలతో పాటు ఇతర విభాగాల ఆధ్వర్యంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ వేడుకల్లో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సుహాసిని, ఎన్సిసి కేర్‌టేకర్ డాక్టర్ సువర్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, పీడీ ఇన్‌చార్జి జ్యోతి, డాక్టర్ రేణుక, డాక్టర్ అరుణతో పాటు ఇతర అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఎన్సిసి సీనియర్ అండర్ ఆఫీసర్ నవ్య, కాడెట్లు, వాలంటీర్లు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు.

## శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో ఘనంగా జెండా ఆవిష్కరణ

**భీమదేవరపల్లి, 26 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**



హనుమకొండ జిల్లా, భీమదేవరపల్లి మండలం, కొత్తకొండ గ్రామంలో దేవదాయ ధర్మాదాయ శాఖకు చెందిన ప్రసిద్ధ శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం (జనవరి 26) జాతీయ పండుగను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థాన ప్రాంగణంలో జాతీయ జెండాను గౌరవప్రదంగా ఆవిష్కరించి, జాతీయ గీతాలాపనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించి, భారత రాజ్యాంగ ప్రాముఖ్యత, ప్రజాస్వామ్య విలువలు, దేశ సమైక్యత, సార్వభౌమత్వంపై అవగాహన కల్పించేలా ప్రసంగాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, ప్రజాప్రతినిధులు, అర్చకులు, దేవస్థాన సిబ్బంది, భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశభక్తి భావాలను ప్రదర్శించారు. దేవాలయ ప్రాంగణం దేశభక్తి నినాదాలతో మార్మోగగా, గణతంత్ర దినోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా, గౌరవప్రదంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన పూజారి రాకేష్, వినయ్ శర్మ, జూనియర్ అసిస్టెంట్లు కొండూరి రవి, శ్రీధర్ కుమార్ తదితరులతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ దేవస్థాన కార్యనిర్వహణ అధికారి కృతజ్ఞతలు తెలిపారు.

## కులమత విద్వేషాలకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

**అసమానతలేని భారత్‌ను నిర్మిద్దాం: డీబీఎఫ్ నాయకుల పిలుపు**

**హన్మకొండ, 26 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**



దేశంలో కుల, మత విద్వేషాలను రెచ్చగొడుతున్న శక్తులకు వ్యతిరేకంగా సమిష్టిగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని, అసమానతలు లేని నవభారతాన్ని నిర్మించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైన ఉందని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్, హనుమకొండ జిల్లా కార్యదర్శి చుంచు నరేష్ పిలుపునిచ్చారు. ప్రపంచ దేశాల్లోనే గొప్పదైన భారత రాజ్యాంగ స్ఫూర్తిని ఎత్తిపడుతూ, మనువాద శక్తుల చెర నుంచి భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం హసన్‌పర్తి మండలంలోని దేవన్నపేట గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ, గణతంత్ర దినోత్సవం అంటే రాజ్యాంగం అమల్లోకి వచ్చిన చారిత్రక దినమని గుర్తు చేశారు. అలాంటి రోజున కూడా అనేక ప్రాంతాల్లో బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని జెండా గద్దెల వద్ద పెట్టకుండా నిర్లక్ష్యం చేయడం సిగ్గుచేటని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర దినోత్సవానికి, గణతంత్ర దినోత్సవానికి ఉన్న తేడా కూడా తెలియని అమాయక పరిస్థితిని కొనసాగించడం సరికాదన్నారు. భారత రాజ్యాంగం స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావాన్ని బలంగా ప్రతిపాదిస్తుంటే, దేశంలోని పాలక యంత్రాంగం మాత్రం కులం, మతాన్ని రెచ్చగొట్టి జాతీయ ఐక్యతను దెబ్బతీసే విధంగా పరిపాలన సాగిస్తోందని రాజేందర్, నరేష్ విమర్శించారు. రాజ్యాంగ స్ఫూర్తిని పాలకులకు మాత్రమే కాకుండా దేశ ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులకు అర్థమయ్యే విధంగా వివరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ దళిత అంబేద్కర్ వాది, పిఎసిఎస్ హసన్‌పర్తి మాజీ డైరెక్టర్ చుంచు విజేందర్‌తో పాటు నాయకులు సందేల స్వామి, సిహెచ్ రవి, ఎలియా, ప్రభాకర్, మల్లయ్య, రాజయ్య, కుమార్, రాజు, సాయి తదితరులు పాల్గొని గణతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా

# ఎస్.డి.డి కాలనీలో ఘనంగా 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

**జాతీయ జెండా ఆవిష్కరించిన కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు డా. నల్లాని శ్రీనివాస్**



**హన్మకొండ, జనవరి 26, 2026(జై భీమ్ న్యూస్)**

వడ్డేపల్లి పరిధిలోని ఎస్.డి.డి కాలనీలో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. కాలనీలోని వినాయక మండపం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్.డి.డి కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు డాక్టర్ నల్లాని శ్రీనివాస్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా. నల్లాని శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎస్.డి.డి కాలనీ ప్రగతి పథంలో ముందుకు సాగుతూ హనుమకొండ పట్టణంలోనే ఒక ఆదర్శ కాలనీగా నిలవడం గర్వకారణమన్నారు. కాలనీవాసులందరూ ఐకమత్యంతో కలిసి పనిచేస్తే, ఇప్పటికీ మిగిలిపోయిన సమస్యలను కూడా సమర్థవంతంగా పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా పార్కు స్థలాల పరిరక్షణ లక్ష్యంగా ముందుకు సాగడమే కాకుండా, ఇతర కాలనీలకు మార్గదర్శకంగా నిలవాలన్నదే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. పచ్చదనం, పరిశుభ్రత ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, కాలనీ అభివృద్ధి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అలాగే దేశ సమైక్యత, సర్వతోముఖాభివృద్ధి కోసం ప్రతి పౌరుడు బాధ్యతగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ గౌరవాధ్యక్షులు పొన్నోజు వీర బ్రహ్మచారి, ఎలసాని అయోధ్య, బి. శ్యాం కుమార్, గూడూరు ప్రేమలత రవీందర్ రెడ్డి, నల్లాని వసుధ శ్రీనివాస్, ఆర్. శ్రీనివాసరావు, ఎస్. సుధాకర్, రాంపల్లి కవిత రాజ ప్రభు, బండి రజిత రాణి లక్ష్మయ్య, కళా, నల్లాని మన్విత పటేల్‌తో పాటు మహిళా సోదరీమణులు, యువతీ-యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# భారత రాజ్యాంగం వర్ధిల్లాలి ఎబిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మంద నరేష్



**వరంగల్, 26 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆల్ బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఎబిఎస్ఎఫ్) ఆధ్వర్యంలో కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని జీడీ హాస్టల్ సమీపంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎబిఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మంద నరేష్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంద నరేష్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశ ప్రజలకు సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం వంటి మౌలిక విలువలను అందించిన మహత్తర గ్రంథమని పేర్కొన్నారు. డా. బీఆర్ అంబేద్కర్ నేతృత్వంలో రూపుదిద్దుకున్న రాజ్యాంగం భారతదేశ ప్రజాస్వామ్యానికి బలమైన పునాదిగా నిలిచిందని అన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన మౌలిక హక్కులు, మౌలిక కర్తవ్యాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని స్పష్టం చేశారు. భారత రాజ్యాంగం మరింతగా వర్ధిల్లాలని, రాజ్యాంగ విలువలను కాపాడే ఉద్యమంలో విద్యార్థులు ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయం మెస్ కేర్ టేకర్ చిరంజీవి మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం దేశానికి రాజ్యాంగం అమలులోకి వచ్చిన చారిత్రక దినమని గుర్తు చేశారు. విద్యార్థులు విద్యతో పాటు సామాజిక బాధ్యతను కూడా అలవరచుకోవాలని సూచించారు. ఎబిఎస్ఎఫ్ కాకతీయ విశ్వవిద్యాలయం అధ్యక్షులు అడ్డా రాజేష్ మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమాల ద్వారా సమాన హక్కుల సాధన సాధ్యమవుతుందని అన్నారు. ప్రధాన నరసింహ, ఉపాధ్యక్షులు మాతంగి విజయ్ కుమార్, చల్లా శ్రీకాంత్, నందు తదితర నాయకులు రాజ్యాంగ విలువల పరిరక్షణకు ఎబిఎస్ఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేయూ ఎబిఎస్ఎఫ్ ఇంచార్జ్ అర్షం చరణ్, రాజ్ పవన్, పీటర్, శ్రవణ్, రాకేష్, ఈశ్వర్ రాజ్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరై జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించి దేశభక్తి నినాదాలతో గణతంత్ర దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు.

# పర్వతగిరి వాసి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

**హైద్రాబాద్, 26 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**



పర్వతగిరి గ్రామానికి చెందిన మేచినేని రాం దయాకర్ రావు ఇటీవల మృతిచెందిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు సోమవారం హైదరాబాద్‌లోని హరణి మ్యాన్షన్‌లో వారి నివాసానికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మేచినేని రాం దయాకర్ రావు కుమారులు రంజిత్ రావు, వంశీ రావు సహా కుటుంబ సభ్యులను కలుసుకుని వారి దుఃఖాన్ని పంచుకున్నారు. ఈ కష్టసమయంలో కుటుంబానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎర్రబెల్లి దయాకర్ రావు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గానికి చెందిన మాజీ జెడ్పీటీసీ పుసుకూరి శ్రీనివాస్ రావు, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు రాజేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు





**వరంగల్, జనవరి 26, 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. దేశ స్వాతంత్ర్యం, రాజ్యాంగ విలువలను స్మరించుకునేలా ఈ వేడుకలు పోలీస్ కమిషనరేట్ సీపీవో భవన ప్రాంగణంలో ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి రాజ్యాంగం అందించిన హక్కులు, బాధ్యతలను ప్రతి పౌరుడు గుర్తుంచుకోవాలని, ప్రజాస్వామ్య పరిరక్షణలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల విశ్వాసాన్ని సంపాదించడమే పోలీసుల ప్రధాన బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ చిన్నారులు, మహిళా సిబ్బంది సహా పోలీస్ అధికారులు, సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేసి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కమిషనరేట్ ప్రాంగణం దేశభక్తి నినాదాలతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో డీసీపీ కవిత, అదనపు డీసీపీలు రవి, ప్రభాకర్ రావు, ఏసీపీలు పింగిలి ప్రశాంత్ రెడ్డి, నరసింహారావు, సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, వివిధ విభాగాలకు చెందిన పోలీస్ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అధికారులు, సిబ్బంది అందరూ ఉత్సాహంగా పాల్గొని దేశభక్తి భావాలను వ్యక్తం చేశారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్ కమిషనరేట్ కార్యాలయం ప్రత్యేక అలంకరణలతో సుందరంగా ముస్తాబైంది. ఈ కార్యక్రమం శాంతియుతంగా, క్రమబద్ధంగా సాగి విజయవంతంగా ముగిసింది.

# మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పోటీ

**ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అభ్యర్థులను బరిలో నిలిపే యోచన**
**పుర పోరుకు జనసైనికులు సంసిద్ధులు కావాలి : తాళ్లపెల్లి బాలు గౌడ్**

**వరంగల్, 26 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**



తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ అధికారికంగా బరిలోకి దిగనున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అధ్యక్షులు, జనసేన పార్టీ జిల్లా నాయకులు తాళ్లపెల్లి బాలు గౌడ్ తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపాలిటీల్లో జనసేన పార్టీ తరఫున అభ్యర్థులను పోటీలో నిలిపే యోచనలో ఉన్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బాలు గౌడ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న జనసేన పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల మద్దతు పెరుగుతోందన్నారు. మున్సిపల్ ఎన్నికల ద్వారా పట్టణ ప్రజలకు నిజమైన సేవ అందించాలనే లక్ష్యంతో పార్టీ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని వరంగల్ జిల్లాలో వర్ధన్నపేట, నర్సంపేట, హనుమకొండ జిల్లాలోని పరకాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూరు, మహబూబాబాద్, కేసముద్రం, స్టేషన్ ఘనపూర్, జనగామ, చేర్యాల మున్సిపాలిటీలలో జనసేన పార్టీ అభ్యర్థులు పోటీలో ఉంటారని తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పార్టీ బలోపేతంపై జనసేన అధిష్టానం ప్రత్యేకంగా దృష్టి సారించిందని, బూత్ స్థాయి నుంచి మున్సిపల్ స్థాయి వరకు పార్టీని బలోపేతం చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేసినట్లు చెప్పారు. పట్టణాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలు, పారిశుధ్యం, రోడ్లు, నిరుద్యోగం, పేదల సంక్షేమం వంటి అంశాలపై జనసేన స్పష్టమైన కార్యాచరణతో ప్రజల ముందుకు వెళ్లనుందని అన్నారు. త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని జనసేన అభ్యర్థులను గెలిపించేందుకు జనసైనికులు, పవన్ కళ్యాణ్ అభిమానులు సమైక్యంగా పనిచేయాలని బాలు గౌడ్ పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త ఎన్నికలను సవాలుగా తీసుకొని ఇంటింటా ప్రచారం నిర్వహిస్తూ ప్రజల్లో పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాలను వివరించాలని సూచించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల సమస్యలకు పరిష్కారం చూపే శక్తి జనసేనకే ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# చైనా మాంజా కాటుకు చిన్నారి బలి

**హైద్రాబాద్, 26 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

నిషేధిత చైనా మాంజా మరో చిన్నారి ప్రాణాన్ని హరించింది. కూకట్‌పల్లి వివేకానందనగర్‌లో చోటుచేసుకున్న హృదయ విదారక ఘటనలో ఐదేళ్ల బాలిక దారుణంగా మృతి చెందింది. వివరాల ప్రకారం, బాలిక కుటుంబ సభ్యులతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సమయంలో రోడ్డుపై వేలాడుతున్న చైనా మాంజా ఒక్కసారిగా ఆమె మెడకు చుట్టుకుంది. మాంజా గొంతును బలంగా కోసిన కారణంగా తీవ్ర రక్తస్రావం జరిగింది. బాలిక స్పృహ కోల్పోవడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. అయితే ఆసుపత్రికి చేరుకునేలోపే బాలిక మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. నిషేధిత చైనా మాంజా వినియోగమే ఈ ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. చైనా మాంజా కారణంగా ఇప్పటికే పలువురు ప్రాణాలు కోల్పోయినా, నిషేధాన్ని కఠినంగా అమలు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చైనా మాంజా అమ్మకాలు, వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై కఠిన శిక్షలు విధించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. చిన్నారి మృతితో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘటన నగరాన్ని మరోసారి షాక్‌కు గురి చేసింది.

# షెట్‌పల్లిలో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



**చెన్నూరు, జనవరి 26, 2026 (జై భీమ్ న్యూస్)**

చెన్నూర్ నియోజకవర్గం, కోటపల్లి మండలం, షెట్‌పల్లి గ్రామంలో దేశ 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించి, దేశభక్తి నినాదాలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో షెట్‌పల్లి గ్రామ సర్పంచ్ శ్రీ గోపీకృష్ణ మంత్రి గారు పాల్గొని గ్రామ ప్రజలందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భారత రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులు, బాధ్యతలను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకుని, ఐక్యత, సమానత్వంతో సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో ఉప సర్పంచ్ చిట్యాల శంకర్, వార్డు సభ్యులు, జిల్లా నాయకులు ఐతా తిరుపతి రెడ్డి, తోటపల్లి సుధాకర్ రెడ్డి, చిట్యాల తిరుపతి, చల్లా రమేష్ రెడ్డి, మండల నాయకులు ఐటిపముల రాజేష్, తోడే లక్ష్మ రెడ్డి, చల్లా రెడ్డి, సెక్రటరీ రాజు పాల్గొన్నారు. అలాగే గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, కారోబార్ సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# భీమారం ఉన్నత పాఠశాలలో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు




**భీమారం, 26 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

భీమారం గ్రామంలోని జెడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ ఏ. శ్రీనివాస్ గారు ఉదయాన్నే జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన దినమే గణతంత్ర దినోత్సవమని, దేశమంతా ఈ పర్వదినాన్ని గర్వంగా జరుపుకుంటుందని అన్నారు. రాజ్యాంగం ద్వారా లభించిన హక్కులు, స్వేచ్ఛలు, సమానత్వం, న్యాయం వంటి విలువలను ప్రతి పౌరుడు గౌరవించి ఆచరించాల్సిన అవసరం ఉందని సూచించారు. భారత రాజ్యాంగంలో పేర్కొన్న సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర భావాలకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని తెలిపారు. రాజ్యాంగ ఫలాలు సమాజంలోని ప్రతి ఒక్కరికీ అందాలంటే ప్రజలు విద్యావంతులు కావడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు విద్య ద్వారానే ఉన్నత శిఖరాలను అధిరోహించి దేశసేవకు అంకితమవ్వాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు. తదనంతరం పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, అత్యధిక హాజరు కలిగిన విద్యార్థులకు, అలాగే గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ అరుణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# వర్ధన్నపేటలో రూ.294 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**వరంగల్ జిల్లా / వర్ధన్నపేట, 26 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో సుమారు రూ.294 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహ నిర్మాణాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో టీయూఎఫ్ఐడీసీ ద్వారా రూ.5 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు, ఇతర నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ, పార్కుల అభివృద్ధి, రూ.200 కోట్లతో అంతర్జాతీయ స్థాయి ఇంటిగ్రేటెడ్ స్కూల్, సబ్ జైల్, రూ.3.5 కోట్లతో స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమాన ప్రాధాన్యతతో అమలు చేస్తూ ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ పేదల సంక్షేమాన్ని విస్మరించలేదని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలలో భాగంగా ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పేదలకు సన్న బియ్యం, అర్హులకు కొత్త రేషన్ కార్డులు, కుటుంబ సభ్యుల పేర్ల నమోదు వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వివరించారు. పేద విద్యార్థుల కోసం హాస్టల్ డైట్ చార్జీలను 40 శాతం, విద్యార్థినులకు కాస్మొటిక్ చార్జీలను 200 శాతం పెంచినట్లు తెలిపారు. విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తూ ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో రూ.200 కోట్లతో అంతర్జాతీయ స్థాయి ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని చెప్పారు. ఇల్లు లేని పేదల కోసం రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4 లక్షల 20 వేల ఇండ్ల నిర్మాణానికి రూ.22,500 కోట్లు వెచ్చించి, ప్రతి ఇంటికి రూ.5 లక్షలు మంజూరు చేశామని, వర్ధన్నపేట నియోజకవర్గానికి కూడా ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరిందని వెల్లడించారు. ఏప్రిల్‌లో రెండో విడతలో కూడా పార్టీలకతీతంగా ఇళ్ల మంజూరు కొనసాగుతుందని తెలిపారు. రైతుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని పేర్కొన్న మంత్రి, రైతు బంధును రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పెంచామని, 26 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసి రూ.21 వేల కోట్ల భారాన్ని ప్రభుత్వం భరించిందని గుర్తు చేశారు. మద్దతు ధరతో పాటు బోనస్ అందిస్తూ రైతులను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని తెలిపారు. వర్ధన్నపేట మున్సిపాలిటీని నందనవనంగా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు నిరంతరం కృషి చేస్తున్నారని మంత్రి ప్రశంసించారు. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చే ప్రక్రియలో 100 శాతం విజయం సాధిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు.



# పి.డి.ఎస్.యు. తెలంగాణ రాష్ట్ర నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక

### రాష్ట్ర అధ్యక్షులుగా కంపాటి పృథ్వీ, ప్రధాన కార్యదర్శిగా ఎస్. అనిల్

**ఖమ్మం, 26 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యు) తెలంగాణ రాష్ట్ర 23వ మహాసభలు ఖమ్మం జిల్లా కేంద్రంలోని జార్జ్ రెడ్డి నగర్‌లోని భక్త రామదాసు కళాక్షేత్రంలో జనవరి 23, 24, 25 తేదీల్లో మూడు రోజుల పాటు అత్యంత ఉత్సాహభరితంగా, విజయవంతంగా ముగిశాయి. ఈ మహాసభలకు రాష్ట్రం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో విద్యార్థులు, యువకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలు, ప్రైవేటీకరణకమర్షియలైజేషన్ దాడులు, పెరుగుతున్న ఫీజుల భారం, నిరుద్యోగం, మతోన్మాద ఫాసిజం, సామ్రాజ్యవాద విధానాలపై విస్తృతంగా లోతైన చర్చలు జరిగాయి. విద్య హక్కును కాపాడేందుకు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని మహాసభ పిలుపునిచ్చింది. మహాసభ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలు, విద్యా గోష్టులు, సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో చైతన్యాన్ని రగిలించాయి. విద్యార్థి అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలను కొనసాగించాలనే దృఢ సంకల్పాన్ని మహాసభ వ్యక్తం చేసింది. ఈ మహాసభలో పి.డి.ఎస్.యు. తెలంగాణ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా కంపాటి పృథ్వీని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎస్. అనిల్‌ను ఎన్నుకున్నారు. అదేవిధంగా భవిష్యత్ కార్యాచరణ, ఉద్యమ ప్రణాళికలను కూడా ఆమోదించారు. నూతన కార్యవర్గంలో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బి. నరసింహ రావు (వరంగల్‌హనుమకొండ), ఎం. నరేందర్ (నిజామాబాద్), ఎస్. రాకేష్ (హైదరాబాద్), దీక్షిత్ (హైదరాబాద్), మునిగెల శివ ప్రశాంత్ (భద్రాద్రి కొత్తగూడెం)లను ఎన్నుకున్నారు. రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా వంగూరి వెంకటేష్ (ఖమ్మం), సురేష్ (కామారెడ్డి), డా. కర్నా గణేష్ (నిజామాబాద్), బోయినపల్లి అజయ్ (వరంగల్‌హనుమకొండ), వీరభద్రం (భద్రాద్రి కొత్తగూడెం)లను నియమించారు. కోశాధికారిగా అంగిడి కుమార్ (కరీంనగర్) బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర కమిటీ సభ్యులుగా వివిధ జిల్లాలకు చెందిన నాయకులను ఎంపిక చేయడంతో పాటు ఇద్దరికి కోఆప్షన్ అవకాశం కల్పించారు. మహాసభలో విద్య, ఉద్యోగాలు, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం విద్యార్థి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని తీర్మానించారు. నూతన జాతీయ విద్యా విధానం2020ను రద్దు చేయాలని, యూజీసీ నూతన ముసాయిదాను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్య రంగానికి ప్రత్యేక మంత్రిని నియమించడంతో పాటు ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టులను శాశ్వతంగా భర్తీ చేయాలని కోరారు. అలాగే విద్యకు రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం, కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం నిధులు కేటాయించాలని, విద్యార్థులందరికీ ఉచిత బస్ సౌకర్యం కల్పించాలని, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని తీర్మానించారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని, ధరల పెరుగుదలకు అనుగుణంగా స్కాలర్షిప్, మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయడంలో సహకరించిన విద్యార్థులు, ప్రజలు, ప్రజాసంఘాలు, మేధావులు, మీడియా మిత్రులకు పి.డి.ఎస్.యు. తెలంగాణ రాష్ట్ర కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.




# నూతన విత్తన చట్టాన్ని ఉపసంహరించాలి

### యూరియా ఆన్లైన్ బుకింగ్ విధానాన్ని రద్దు చేయాలి ఏఐకేఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వల్లెపు ఉపేందర్ రెడ్డి డిమాండ్

**హన్మకొండ, జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తూ విత్తన వ్యాపారులు, పెట్టుబడిదారులకు మేలు చేసే కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విత్తన చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్న యూరియా ఆన్లైన్ బుకింగ్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వల్లెపు ఉపేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎస్కేవైఎం జాతీయ కమిటీ పిలుపులో భాగంగా, అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం వెయ్యి స్తంభాల గుడి నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ ముందు రైతులు భారీగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన ధర్నాను ఉద్దేశించి వల్లెపు ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ, సమాజ భవిష్యత్తుకు జీవనాధారమైన వ్యవసాయ రంగాన్ని, రైతులను ఆదుకోవాల్సిన పాలకవర్గాలు ఇందుకు భిన్నంగా వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే విధంగా చట్టాలు, విధానాలు రూపొందిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నూతన విత్తన చట్టం చిన్న, సన్నకారు రైతులను దివాలా దిశగా నెట్టివేస్తూ, ఆత్మహత్యలకు ప్రేరేపించేలా ఉందన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, రుణాలు సమయానికి అందించకుండా కృత్రిమ కొరత సృష్టిస్తూ అనేక కుంటి సాకులతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని, యూరియా సబ్సిడీ ఎత్తివేసేందుకు కుట్రలో భాగంగానే ఆన్లైన్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టారని ఆరోపించారు. దీని వల్ల కౌలు రైతులు సహా ఇతర రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, యూరియా అందక పంట దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని తెలిపారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా వందలాది వ్యవసాయ అధికారుల పోస్టులు ఖాళీగా ఉండటం వల్ల క్షేత్రస్థాయిలో రైతులకు తగిన సాంకేతిక సహాయం అందడం లేదని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో రైతులకు హానికరమైన నూతన విత్తన చట్టాన్ని, యూరియా ఆన్లైన్ బుకింగ్ విధానాన్ని వెంటనే రద్దు చేసి, వ్యవసాయ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్. రెడ్డి హంసారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు నీల రవీందర్, కర్ర సీతారామరెడ్డి, కూతురు ఇంద్రారెడ్డి, ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి మొగిలి శ్రీనివాస రావు, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి, రైతు సంఘం సభ్యులు మహేష్, భూక్య లింగయ్య తదితరులు పాల్గొన్నారు.




# మేడారాన్ని సందర్శించిన న్యూజిలాండ్ మావోరి తెగ ప్రతినిధులు

### గద్దల ప్రాంగణంలో హాకా నృత్య ప్రదర్శన కళాకారులతో కలిసి నృత్యం చేసిన మంత్రి సీతక్క



**మేడారం, జనవరి 26, 2026 (జై భీమ్ న్యూస్):**

ప్రపంచ ప్రఖ్యాత శ్రీ సమ్మక్కసారలమ్మ మహాజాతర సందర్భంగా సోమవారం న్యూజిలాండ్‌కు చెందిన మావోరి తెగ (మావోరి ట్రైబ్స్) ప్రతినిధులు మేడారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మేడారం గద్దల ప్రాంగణంలో మావోరి తెగ వారి సంప్రదాయ నృత్యమైన "హాకా" నృత్యాన్ని అత్యంత ఉత్సాహంగా ప్రదర్శించారు. హాకా నృత్యం మావోరి తెగలో యుద్ధానికి సిద్ధమయ్యే సమయంలో సైనికుల్లో ధైర్యాన్ని, ఉత్సాహాన్ని నింపేందుకు, శత్రువుల్లో భయాన్ని కలిగించేందుకు చేసే సంప్రదాయ నృత్యంగా ప్రసిద్ధి చెందింది. ముఖభావాలు, శరీర చలనాలతో కూడిన ఈ నృత్యం అక్కడి భక్తులు, సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. తెలంగాణన్యూజిలాండ్ సాంస్కృతిక మార్పిడి కార్యక్రమంలో భాగంగా పంచాయతీ రాజ్, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో మావోరి తెగ ప్రతినిధులు మేడారం మహాజాతరను సందర్శించారు. హాకా నృత్య ప్రదర్శన సందర్భంగా మంత్రి సీతక్క స్వయంగా కళాకారులతో కలిసి నృత్యం చేసి వారి ఉత్సాహాన్ని పెంచారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఆదివాసీ సంస్కృతికి దేశ సరిహద్దులు, భాషలు అడ్డుకావని, ప్రపంచంలోని ఎక్కడైనా ఆదివాసీలు అడవి, ప్రకృతిపై ఆధారపడి జీవనం సాగిస్తారని అన్నారు. ఆదివాసీ జీవన విధానం, విశ్వాసాలు ప్రపంచవ్యాప్తంగా ఒకే తత్వాన్ని ప్రతిబింబిస్తాయని ఆమె పేర్కొన్నారు. అనంతరం మావోరి తెగ ప్రతినిధులను గద్దల వద్దకు తీసుకెళ్లి వన దేవతల దర్శనం చేయించారు. సమ్మక్కసారలమ్మ వన దేవతల వైభవం, చరిత్రను మంత్రి సీతక్క వారికి వివరించారు. ఈ సందర్భంగా బంగారం, వన దేవతల ప్రసాదాన్ని అందజేసి మావోరి తెగ ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రా, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బొల్లికుంటలో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు




**మామునూర్, 26 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

బొల్లికుంట గ్రామంలోని హోరేబు బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించగా, దేశభక్తి భావాలతో వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి. ఈ కార్యక్రమంలో స్థానిక సంఘ కాపరి యాసారపు మధుప్రణయ్ మాట్లాడుతూ, క్రైస్తవులు దైవభక్తితో పాటు దేశభక్తిని కూడా సమానంగా కలిగి ఉండాలని అన్నారు. దేవుని వాక్యానికి లోబడి, దేశ చట్టాలను గౌరవిస్తూ, రాజ్యాధికారులు, నాయకులు, పాలకుల కోసం ప్రార్థనలు చేయాలన్న యేసుక్రీస్తు ఆజ్ఞలను శిరసావహిస్తూ దేశ క్షేమం కోసం ప్రార్థించడం ప్రతి క్రైస్తవుని బాధ్యత అని పేర్కొన్నారు. దేశానికి ఎలాంటి నష్టం కలిగించే చర్యలను కలలో కూడా అంగీకరించకుండా, దేశ సేవలో నమ్మకమైన భాగస్వాములుగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే డా. బీ.ఆర్. అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం మత స్వేచ్ఛను, లౌకికవాదాన్ని సమానంగా కల్పించిందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా హోరేబు బాప్టిస్ట్ సంఘ వ్యవస్థాపకులు రెవ. జన్ను కోర్నెల్ జన్మదిన వేడుకలను కూడా ఘనంగా నిర్వహించి పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంఘ కాపరి యాసారపు మధుప్రణయ్, దీనా ప్రశాంతి పాస్టరమ్మ, సంఘ కమిటీ గౌరవ అధ్యక్షులు పి. జార్జ్, ప్రెసిడెంట్ పి. లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యక్షులు ప్రవీణ్ టోనీ, కార్యదర్శి కె. సమ్మయ్య, జాయింట్ ట్రెజరర్ పి. రాజు, సంఘ పెద్దలు దాసు, యస్. చంద్రపాల్, ప్రసాద్, యూత్ ప్రెసిడెంట్ ఇంద్రనీల్, సండే స్కూల్ సూపరింటెండెంట్ సునీల్, స్త్రీల సమాజ సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా 17వ డివిజన్ కార్పొరేటర్ గద్దె బాబు, మాజీ కార్పొరేటర్ పి. స్వర్ణలత వజ్రయ్య, భూమాత, పి. సాల్మన్, గ్రామ పెద్దలు, అధికారులు, నాయకులు, మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# కలెక్టరేట్‌లో ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

**హన్మకొండ, 26 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**



భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని హనుమకొండ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) ప్రాంగణంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు, జానపద గీతాలు, జానపద నృత్యాలు అలరించాయి. ప్రభుత్వ విద్యారణ్య సంగీత నృత్య కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన పేరిణి నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అదే కళాశాలకు చెందిన విద్యార్థుల వయోలిన్ సంగీత ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. విద్యార్థిని తేజశ్రీ ప్రదర్శించిన ఇంద్రజాల ప్రదర్శన అందరి దృష్టిని ఆకర్షించింది. తెలంగాణ సాంస్కృతిక కళాకారులు ఆలపించిన దేశభక్తి గీతాలు దేశప్రేమను ఉప్పొంగించాయి. ఈ సాంస్కృతిక కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాం రెడ్డి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలకమండలి సభ్యులు ఇ.వి. శ్రీనివాసరావు, జిల్లా చైర్మన్ డాక్టర్ విజయ్ చందర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్‌తో పాటు జిల్లా అధికారులు, ఉద్యోగులు వీక్షించారు. ఈ సాంస్కృతిక కార్యక్రమాలకు చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సౌరం ప్రవీణ్ కుమార్ వ్యాఖ్యాతగా వ్యవహరించి కార్యక్రమాల వివరాలను సమర్థంగా వివరించారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE సమస్యలపై సమరంగా Jai Bheem సామాన్యుడి ఆయుధంగా

# ఉత్తమ సేవలందించిన సిబ్బందికి ప్రశంసలు: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ





**వరంగల్, 26 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు ఇండియన్ నేషనల్ ఫ్లాగ్‌ను ఆవిష్కరించి, గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను సిబ్బందికి వివరించారు. అనంతరం వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఉత్తమ సేవలు అందిస్తున్న సిబ్బందిని గుర్తించి వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రజారోగ్య పరిరక్షణలో సిబ్బంది సేవలు అభినందనీయమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. తదుపరి కుష్‌మహల్ ఫోర్ట్, వరంగల్‌లో నిర్వహించిన రిపబ్లిక్ డే వేడుకలకు డాక్టర్ బి. సాంబశివరావు హాజరయ్యారు. అక్కడ ఏర్పాటు చేసిన ఐఈసీ ఎగ్జిబిషన్ స్టాల్‌ను సందర్శించి, గౌరవ మేయర్ గుండు సుధారాణికి, గౌరవ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదకి, ఇతర అధికారులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న వివిధ సేవలపై వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, ప్రోగ్రాం అధికారులు, ప్రశంసా పత్రాలు పొందిన సిబ్బంది, డిప్యూటీ డెమో అధికారులు, వివిధ కేడర్లకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

# బైరాన్‌పల్లి గ్రామంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ




**హసన్ పర్తి, 26 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తి మండలం బైరాన్‌పల్లి గ్రామంలో 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కోరమాండల్ కంపెనీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో విద్యపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు, వారికి అవసరమైన మౌలిక వసతులను అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు ఎగ్జామినేషన్ ప్యాడ్లు, వాటర్ బాటిల్స్ మరియు బిస్కెట్లను పంపిణీ చేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలకు ఇవి ప్రోత్సాహకరంగా ఉంటాయని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కోరమాండల్ కంపెనీ ప్రతినిధి శ్రీధర్ రెడ్డి కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. దేశ అభివృద్ధిలో విద్యకు కీలక పాత్ర ఉందని పేర్కొన్న ఆయన, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. సమాజానికి ఉపయోగపడే విధంగా కంపెనీ తరపున భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హాజరై కోరమాండల్ కంపెనీ చేపట్టిన సేవా కార్యక్రమాన్ని ప్రశంసించారు.

# బాలికల పట్ల వివక్ష తగదు లింగ నిష్పత్తి పెంపుకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు





## హన్మకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**హన్మకొండ, 26 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

బాలికల పట్ల వివక్ష అనేది సమాజ పురోగతికి ఆటంకమని, జిల్లాలో బాలికల లింగ నిష్పత్తి తగ్గడానికి గల కారణాలను సమగ్రంగా విశ్లేషిస్తూ వాటిని అధిగమించేందుకు ప్రభుత్వం పటిష్టమైన కార్యాచరణ చేపడుతోందని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. బాలికల సంరక్షణ, లింగ సమానత్వంపై ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా సమాజంలో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన హెల్త్ స్టాల్ వద్ద జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన అవగాహన పోస్టర్లు, పాంప్లెట్లను కలెక్టర్ స్నేహ శబరీష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పుట్టబోయే బిడ్డ అమ్మాయా అబ్బాయా అన్న తేడా లేకుండా సమానంగా ఆదరించాలనే భావనను ప్రతి కుటుంబంలోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. గర్భిణీ స్త్రీల మొబైల్ నంబర్లకు ప్రత్యేక సందేశాల ద్వారా లింగ వివక్షపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నియంత్రణ చట్టం (పి.సి.పి.ఎన్.డి.టి) ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలను ప్రోత్సహించడం, నిర్వహించడం నేరమని, చట్ట వ్యతిరేకంగా గర్భస్రావాలు (అబార్షన్లు) చేయడం కూడా శిక్షార్హమైన నేరమని ప్రజలకు స్పష్టంగా తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై ఎలాంటి సడలింపులు లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎవరి దృష్టికి వచ్చినా 6300 030940 నంబర్‌కు సమాచారం అందించాలని కలెక్టర్ కోరారు. ప్రజల సహకారంతోనే బాలికల లింగ నిష్పత్తి మెరుగుపడుతుందని అన్నారు. అలాగే గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా గర్భం దాల్చిన వెంటనే తమ పేరును ఏఎన్‌ఎం వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పి.సి.పి.ఎన్.డి.టి, ఎంటిపి చట్టాలపై పూర్తి అవగాహన, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం చేయించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, సాధారణ ప్రసవం (నార్మల్ డెలివరీ) తల్లి, బిడ్డ ఆరోగ్యానికి అత్యంత శ్రేయస్కరమన్న అంశాలపై సమగ్ర సమాచారంతో కూడిన లేఖలను ఆరోగ్య సిబ్బంది ద్వారా గర్భిణీ మహిళలు, దంపతులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరగేలా చర్యలు తీసుకుంటున్నామని, ముహూర్తాల పేరుతో అనవసర సిజేరియన్ ప్రసవాలను ప్రోత్సహించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. లింగ సమానత్వం పాటించినప్పుడే సమాజం సమతుల్యంగా అభివృద్ధి చెందుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ దార కవిత, అడిషనల్ కలెక్టర్ ఎన్. రవి, డీఆర్‌డీఓ శ్రీ మేన శీను, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎ. అప్పయ్య, ఆర్డీవో రాథోడ్ రమేష్, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ టీ. మదన్ మోహన్ రావు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీనివాస్, డెమో వి. అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ యూనివర్సిటీలో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

## ఎన్జీవోస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహణ రాజ్యాంగ విలువలపై పిలుపు

**వరంగల్, జనవరి 26 (జై భీమ్ న్యూస్)**

77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకతీయ యూనివర్సిటీ ఎన్జీవోస్ యూనియన్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రాంగణం దేశభక్తి నినాదాలతో, జాతీయ భావంతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో ఎన్జీవోస్ యూనియన్ సభ్యులు విస్తృతంగా పాల్గొన్నారు. యూనియన్ అధ్యక్షులు శ్రీ బూర నవీన్ కుమార్ గారు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా, అనంతరం జాతీయ గీతం ఆలపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. భారత రాజ్యాంగంలో నిక్షిప్తమైన సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ వంటి విలువలను ప్రతి పౌరుడు కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరిస్తూ, దేశ అభివృద్ధిలో విద్యా సంస్థల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఎన్జీవో ఉద్యోగులు సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చిన ఆయన, యూనివర్సిటీ అభివృద్ధికి ఐక్యత ఎంతో అవసరమని అన్నారు. యువత దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని, శాంతిసౌభ్రాతృత్వమే భారతీయ సంస్కృతికి పునాదులని వివరించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ ఎన్జీవోస్ యూనియన్ జనరల్ సెక్రటరీ వల్లాల తిరుపతి, వైస్ ప్రెసిడెంట్ మొహమ్మద్ యునస్, నాయకులు ఎతిరాజుల సతీష్ బాబు, తాటి దామోదర్, బి. కృష్ణ వేణి, ఫైనాన్స్ ఆఫీసర్ హబీబుద్దీన్, ఆడిట్ ఆఫీసర్ ఎల్. రాము, రిటైర్డ్ ఉద్యోగ నాయకులు నారాయణ రావు, చుక్కరావు, ఎల్లయ్య, ఖఖ నాల్గవ తరగతి ఉద్యోగ సంఘం నాయకులు గుమ్మయ్య, బొక్క మొగిలి, అంకుష్, తిరుమల్ సింగ్, వాలి పాషా తదితర ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగియగా, పాల్గొన్న సభ్యులందరికీ యూనియన్ కృతజ్ఞతలు తెలిపింది. గణతంత్ర దినోత్సవ స్ఫూర్తిని నిత్యం కొనసాగించాలని నిర్ణయించారు. చివరగా జై హింద్ నినాదాలతో కార్యక్రమం ముగిసింది.



# స్నేహబంధానికి సాక్ష్యమైన మేడారం..

## భావోద్వేగ క్షణాల్లో మంత్రి సీతక్క

**ములుగు, 26 జనవరి 2026 (జై భీమ్ న్యూస్):**



మేడారం మహాజాతర సందర్భంగా మంత్రి సీతక్క చిన్ననాటి స్నేహాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగ క్షణాలను పంచుకున్నారు. ములుగు బాలికల పాఠశాలతో పాటు ములుగులోని హాస్టల్‌లో కలిసి చదువుకున్న తన చిన్ననాటి స్నేహితులను మేడారంలో ఆత్మీయంగా కలుసుకున్నారు. చదువు రోజుల జ్ఞాపకాలను తలచుకుంటూ, స్నేహితులతో కలిసి సరదాగా గడిపిన క్షణాలు అక్కడి వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. మేడారం సందర్శన సందర్భంగా పాఠశాల రోజుల స్నేహితులంతా ఒక్కచోట చేరడంతో వాతావరణం ఉత్సాహంతో నిండిపోయింది. అప్పటి అనుభవాలు, మధుర జ్ఞాపకాలను పరస్పరం పంచుకుంటూ స్నేహబంధాన్ని మరింత బలపరుచుకున్నారు. ఈ సందర్భంగా మేడారంలోని సెల్ఫీ పాయింట్ల వద్ద స్నేహితురాళ్లతో కలిసి ఫోటోలు దిగిన మంత్రి సీతక్క, ఆ చిత్రాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. హోదా, పదవిని పక్కనబెట్టి స్నేహితులతో సహజంగా కలిసిపోయిన మంత్రి సీతక్క తీరు ప్రజల మనసులను దోచుకుంది. చిన్ననాటి స్నేహానికి ఇప్పటికీ అదే విలువ ఉందని, జీవితంలో స్నేహబంధాలు ఎప్పటికీ ప్రత్యేకమైనవేనని మంత్రి సీతక్క ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ఘనంగా మహనీయుల ఉత్సవ కమిటీ చైర్మన్ అంకేశ్వరపు రాంచందర్ రావు జన్మదిన వేడుకలు

**శుభాకాంక్షలు తెలిపిన జై భీమ్ సంస్థల చైర్మన్ డా. బరిగెల శివ**

**వరంగల్, 26 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ మహానగరంలోని దర్గా కాజీపేట ప్రాంతంలో మహనీయుల ఉత్సవ కమిటీ చైర్మన్ అంకేశ్వరపు రాంచందర్ రావు జన్మదిన వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుటుంబ సభ్యులు, బంధువులు, శ్రేయోభిలాషులు, ప్రజాసంఘాల నేతలు, రాజకీయ నాయకులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను మరింత ఉత్సాహభరితంగా మార్చారు. ఈ సందర్భంగా జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్ డా. బరిగెల శివ ఫోన్ ద్వారా అంకేశ్వరపు రాంచందర్ రావుకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాంచందర్ రావు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డా. బరిగెల శివ మాట్లాడుతూ, అంకేశ్వరపు రాంచందర్ రావు మహనీయుల ఆశయాలను ప్రజల్లో విస్తరింపజేస్తూ సామాజిక చైతన్యం పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. మహనీయుల ఉత్సవ కమిటీ ద్వారా సమానత్వ భావన, సామాజిక న్యాయం, యువతలో అవగాహన పెంపొందించేందుకు ఆయన చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. ఇటువంటి వ్యక్తులు సమాజానికి మార్గదర్శకులుగా నిలుస్తారని కొనియాడారు. అదేవిధంగా కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాసంఘాల నేతలు, రాజకీయ నాయకులు




మాట్లాడుతూ అంకేశ్వరపు రాంచందర్ రావు సామాజిక సేవా దృక్పథం, ప్రజలతో మమేకమై పనిచేసే విధానం ప్రశంసనీయమని తెలిపారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ సమాజాభివృద్ధికి మరింతగా తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేయగా, అనంతరం మిత్రులు, అభిమానులు, శ్రేయోభిలాషులు తమ అభినందనలు తెలిపారు. కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో, ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో మంద కుమార్, విద్యాసాగర్, అనిల్ కాందారి తదితరులు పాల్గొన్నారు.

# దళితబహుజనులకు రాజ్యాంగమే భవిష్యత్తుకు దారి చూపింది

**రేణు కుంట్ల దుర్గాప్రసాద్**

**హాసన్ పర్తి, 26 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన 77వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్లాపూర్ గ్రామంలో అంబేద్కర్ జయంతిరాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం దళితబహుజన వర్గాల హక్కులు, సమానత్వం, సామాజిక న్యాయం వంటి రాజ్యాంగ విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో నిర్వహించబడింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హైస్కూల్ హెడ్‌మాస్టర్ పుల్ల సంపత్ హాజరై, భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు రేణు కుంట్ల దుర్గాప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రేణు కుంట్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, "దళితబహుజనులకు రాజ్యాంగమే భవిష్యత్తుకు నేడు దారి చూపించిన మహాగ్రంథం. మన జీవితాలను, హక్కులను, అవకాశాలను నిర్ణయించేది రాజ్యాంగమే. అందుకే ప్రతి విద్యార్థి, ప్రతి యువకుడు రాజ్యాంగాన్ని తెలుసుకొని ఆ దిశగా ప్రయాణం చేయాలి" అని అన్నారు. ఆటలతో పాటు చదువులోనూ దళితబహుజన యువత ముందుండాలని, విద్య ద్వారానే సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో పురోగతి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. యువత ఉద్యోగాల్లోనే కాకుండా రాజకీయంగా కూడా ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. దళితులు చదువుకోవాలన్న డా. అంబేద్కర్ ఆశయానికి ఉదాహరణగా ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోకు చెందిన 14 ఏళ్ల బాలుడు అశ్వమిత్ గౌతమ్‌ను ఆయన ప్రస్తావించారు. అతి చిన్న వయసులోనే డా. అంబేద్కర్, భగత్‌సింగ్ వంటి మహానుభావుల రచనలు చదివి, సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నలు వేస్తూ ప్రభుత్వ మేధావి వర్గాలకే ముచ్చెమటలు పట్టిస్తున్నాడని అన్నారు. అన్యాయాలను ఎదుర్కోవాలంటే దళితులందరూ చదువుకోవాలన్న అంబేద్కర్ సూచనకు అశ్వమిత్ గౌతమ్ ఒక జీవంత ఉదాహరణ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అశ్వమిత్ గౌతమ్‌పై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, పేద విద్యార్థి కావడంతో ప్రభుత్వ ఖర్చులతో అతని ఉన్నత విద్యను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చదువు అనే పెన్నుతోనే సమాధానం చెప్పగలమని, ప్రశ్నించే తత్వమే సమాజ మార్పుకు పునాది అని ఆయన స్పష్టం చేశారు. ఈ



కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కల్వచర్ల సుదర్శన్, మాజీ సర్పంచులు దేవనబోయిన కుమారస్వామి, పాడి రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నేదునూరి సునీల్, సంఘం ఉపాధ్యక్షులు వెలిసోజు రమణాచారి, గోపనబోయిన సతీష్, బొర్ర సురేష్, దోమల శ్రీనివాస్, బన్నీ, కల్వచర్ల ప్రవీణ్ తదితరులు పాల్గొని రాజ్యాంగ విలువలపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. మొత్తంగా ఈ కార్యక్రమం రాజ్యాంగ ప్రాముఖ్యతను, విద్య ద్వారా సాధ్యమయ్యే సామాజిక మార్పును ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లిన కార్యక్రమంగా నిలిచింది.

# ప్రజాసేవలో నిబద్ధతకు గుర్తింపు

**ఉత్తమ ఉద్యోగిగా కాందారి నాగరోహన్‌కు జిల్లా స్థాయి గౌరవం**

**హన్మకొండ జిల్లా, వేలేరు, 26 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగుల సేవలను గుర్తిస్తూ నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమంలో హాసన్‌పర్తి మండలం మడిపల్లి గ్రామానికి చెందిన, వేలేరు మండలం తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కాందారి నాగరోహన్ ఉత్తమ ఉద్యోగిగా ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన గణతంత్ర వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీమతి స్నేహ శభరీష్ చేతులమీదుగా ఆయన ప్రశంసాపత్రాన్ని స్వీకరించారు. ప్రజలకు అందించే సేవల్లో వేగం, పారదర్శకత, బాధ్యతాయుత పనితీరుతో పాటు కార్యాలయ నిర్వహణలో క్రమశిక్షణను పాటిస్తూ విధులు నిర్వర్తిస్తున్నందుకు గాను కాందారి నాగరోహన్‌ను ఉత్తమ ఉద్యోగిగా ఎంపిక చేసినట్లు జిల్లా అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా రెవెన్యూ సంబంధిత పనుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమయపాలనతో సేవలు అందించడం, సమస్యల పరిష్కారంలో సానుకూల దృక్పథంతో స్పందించడం ఆయనకు ఈ గుర్తింపును తీసుకొచ్చిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శభరీష్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులు ప్రజాసేవనే ప్రధాన ధ్యేయంగా తీసుకొని విధులు నిర్వహించాలని సూచించారు. నిజాయితీ, కర్తవ్యనిష్ఠ, అంకితభావంతో పనిచేస్తే ఇలాంటి గౌరవాలు సహజంగానే లభిస్తాయని తెలిపారు. కాందారి నాగరోహన్‌కు లభించిన ఈ గుర్తింపు ఇతర ఉద్యోగులకు ఆదర్శంగా నిలుస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఉత్తమ ఉద్యోగిగా ఎంపిక కావడం తనకు ఎంతో గర్వకారణమని కాందారి నాగరోహన్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులోనూ ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తానని ఆయన అన్నారు. తన



సేవలకు సహకరించిన ఉన్నతాధికారులు, సహోద్యోగులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, రెవెన్యూ విభాగానికి చెందిన సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొని కాందారి నాగరోహన్‌ను అభినందించారు. ప్రజాసేవలో అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు ఈ సన్మానం గొప్ప ప్రోత్సాహంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.

# కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్

**బీఆర్ఎస్ పార్టీలో చేరికలు**

**సొంత గూటికి చేరిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు నరేష్ కుమార్ యాదవ్**





**వికారాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్:**

వికారాబాద్ జిల్లా పరిగి మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీలో కాంగ్రెస్ ముఖ్య నాయకుల భారీ చేరికలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నరేష్ కుమార్ యాదవ్, నేడు పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఆర్ పార్టీలో చేరడం జరిగింది. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానం పలికిన పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం పని చేయాలని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాటుగా మాజీ మున్సిపల్ ఛైర్మన్ అశోక్ కుమార్, గడిసింగాపూర్ మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు అశోక్ రెడ్డి, ముకుంద శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ పరిరక్షణలో పోలీసు వ్యవస్థ కీలక పాత్ర

**ఆర్‌బివిఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు**



**హైద్రాబాద్, 26 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

ఆర్‌బివిఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. దేశ రాజ్యాంగ విలువలను స్మరించుకుంటూ, పోలీసు వ్యవస్థ బాధ్యతలను పునఃస్మరణ చేసుకునేలా ఈ కార్యక్రమం జరిగింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా డిప్యూటీ డైరెక్టర్ శ్రీ డి. మురళీధర్ ఐపీఎస్ హాజరై సమ్మన్ గార్డ్‌ను స్వీకరించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డి. మురళీధర్ ఐపీఎస్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం 1950 జనవరి 26న అమలులోకి వచ్చిందని, అప్పటి నుంచి దేశ ప్రజలందరికీ రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు, స్వేచ్ఛలు, రక్షణలు సమర్థవంతంగా అందుతున్నాయంటే అందుకు ప్రధాన కారణం పోలీసు వ్యవస్థేనని స్పష్టం చేశారు. గత 77 సంవత్సరాలుగా రాజ్యాంగ అమలులో ఇతర ప్రభుత్వ విభాగాలతో పోలిస్తే పోలీసు విభాగం బాధ్యత అత్యంత కీలకమైనదిగా కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడటంలో పోలీసుల పాత్ర అనిర్వచనీయమని ఆయన అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల హక్కులను గౌరవిస్తూ, రాజ్యాంగ ఆత్మకు అనుగుణంగా విధులు నిర్వహించాల్సిన బాధ్యత పోలీసు శాఖపై ఉందన్నారు. ప్రత్యేకంగా పోలీస్ శిక్షణా కేంద్రాల్లో శిక్షణ పొందుతున్న ఇండక్షన్ ట్రైనీలు, ఇన్-సర్వీస్ ట్రైనీలకు రాజ్యాంగ స్ఫూర్తి, మానవ హక్కులు, ప్రజాసేవ భావనను మరింత బలంగా బోధించాల్సిన అవసరం ఉందని సూచించారు. రాజ్యాంగ విలువలను లోతుగా అర్థం చేసుకున్న పోలీసు అధికారులు మాత్రమే ప్రజల విశ్వాసాన్ని సంపాదించగలరని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా ఇండోర్, ఔట్‌డోర్ ఫ్యాకల్టీ సభ్యులు శిక్షణా ప్రక్రియలో రాజ్యాంగ విలువలను అంతర్భాగం చేయాలని, అందుకు సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శిక్షణ పొందుతున్న ప్రతి పోలీసు అధికారి రాజ్యాంగాన్ని ఒక పుస్తకంగా మాత్రమే కాకుండా, తన వృత్తి జీవితానికి మార్గదర్శిగా భావించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి జాయింట్ డైరెక్టర్ డి. మురళీధర్ ఐపీఎస్, డిప్యూటీ డైరెక్టర్ (అడ్మిన్) కే.ఆర్.కే. ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్లు ఘంటా వెంకట్రావు, వి.వి. రమణ, వి. శ్రీనివాసరావు పాల్గొన్నారు. అలాగే ఫ్యాకల్టీ డీఎస్పీలు సతీష్ కుమార్, పి.జి. రెడ్డి, ఆదూరి శ్రీనివాసరావు, అమృత రెడ్డి, సందీప్ రెడ్డి, దేవారెడ్డి, భాస్కర్, రామారావు, రవీంద్రాజు, ఇంటెలిజెన్స్ డీఎస్పీలు ఆనందరెడ్డి, కృష్ణ, టి. శ్రీనివాసరావు, జగదీశ్వరావు, తిరుపతి, లా ఫ్యాకల్టీ డాక్టర్ రవికుమార్, వరలక్ష్మి, యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమాదేవి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ యాదమ్మ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు, ఫ్యాకల్టీ సభ్యులు, శిక్షణార్థులు పాల్గొన్నారు. అకాడమీ క్వార్టర్స్‌లో నివసిస్తున్న అధికారుల కుటుంబ సభ్యులు కూడా ఈ వేడుకల్లో పాల్గొని గణతంత్ర దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. దేశభక్తి నినాదాలు, శుభాకాంక్షల మధ్య కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. మొత్తంగా ఈ గణతంత్ర దినోత్సవ వేడుకలు రాజ్యాంగ విలువలు, పోలీసు వ్యవస్థ బాధ్యతలు, ప్రజాసేవ ప్రాముఖ్యతను మరోసారి గుర్తు చేస్తూ శిక్షణార్థుల్లో దేశభక్తి, కర్తవ్యనిష్ఠను మరింత పెంపొందించిన కార్యక్రమంగా నిలిచాయి.



# ఒక వ్యక్తితో డేటింగ్‌లో ఉన్నా: హీరోయిన్ ఈషా రెబ్బా

టాలీవుడ్ హీరోయిన్ ఈషా రెబ్బా, దర్శకుడు, నటుడు తరుణ్ భాస్కర్ మధ్య ప్రేమ, పెళ్లి రూమర్స్ గత కొన్ని నెలలుగా ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. వీరిద్దరు డేటింగ్‌లో ఉన్నారని, త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నారని సోషల్ మీడియాలో, మీడియా వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. గత దీపావళి పండుగా సందర్భంగా వీరు ఫ్రెండ్స్‌తో కలిసి సెలబ్రేట్ చేసుకున్న ఫొటోలు వైరల్ కావడంతో ఈ రూమర్స్ మరింత ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో, ఈషా తనపై వస్తున్న వార్తలపై స్పందించింది. ఈషా హీరోయిన్‌గా, తరుణ్ భాస్కర్ హీరోగా నటించిన కొత్త చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః' ఈ నెల 30న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ మూవీ ప్రమోషన్స్ జోరుగా సాగుతున్నాయి. ప్రమోషన్స్ సందర్భంగా ఈషా మాట్లాడుతూ, ఈ రూమర్స్ పై స్పందించింది. "జరుగుతున్న ప్రచారం నిజం కాదు" అని ఆమె స్పష్టం చేసింది. తన తండ్రి కూడా ఈ వార్తలు చూసి "పెళ్లెప్పుడు?" అని అడిగారని చెప్పింది. అయితే, తాను ఒక వ్యక్తితో డేటింగ్ లో ఉన్నానని తెలిపింది. కానీ, అది ఇంకా ప్రారంభ దశలోనే ఉందని చెప్పింది. అయితే, ఆ వ్యక్తి తరుణ్ భాస్కరా? కాదా? అన్నది మాత్రం స్పష్టం చేయలేదు.

# అయ్యప్ప మాలలో రవితేజ.. ఆకట్టుకుంటున్న 'ఇరుముడి' ఫస్ట్ లుక్



మాస్ మహారాజా రవితేజ తన కెరీర్‌లో ఓ విభిన్నమైన సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఎమోషనల్ కథలకు పేరుగాంచిన దర్శకుడు శివ నిర్వాణతో ఆయన చేస్తున్న ఒ=77 చిత్రానికి 'ఇరుముడి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాలో విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ పోస్టర్‌లో రవితేజ అయ్యప్ప మాల ధరించి, తలపై ఇరుముడి పెట్టుకుని భజనలో నృత్యం చేస్తున్నట్లు కనిపించారు. ఆయన ఒక చేతిలో తన కుమార్తె (బేబీ నక్షత్ర)ను పట్టుకుని ఉండటం చూస్తుంటే, ఇది తండ్రీకూతుళ్ల మధ్య బలమైన అనుబంధంతో కూడిన కథ అని స్పష్టమవుతోంది. రవితేజ ఇప్పటివరకు చేసిన మాస్ చిత్రాలకు పూర్తి భిన్నంగా ఈ సినిమా ఉండబోతోందని ఫస్ట్ లుక్‌తోనే దర్శకుడు శివ నిర్వాణ సంకేతమిచ్చారు. భక్తి, భావోద్వేగాల కలబోతగా ఈ కథను శక్తిమంతంగా తీర్చిదిద్దుతున్నట్లు సమాచారం. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను పంచుకుంటూ రవితేజ ఓ భావోద్వేగ సందేశాన్ని పోస్ట్ చేశారు. "కొన్ని కథలు సరైన సమయంలో మనల్ని వెతుక్కుంటూ వస్తాయి. అలాంటి ఓ కథలో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నాను. నమ్మకాన్ని ముందుంచి 'ఇరుముడి' అనే ఈ కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నాను. స్వామియే శరణం అయ్యప్ప" అని ఆయన పేర్కొన్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఫస్ట్ లుక్‌తోనే సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ అయింది.

# పోలీస్ స్టేషన్లలో రిపోర్టర్ల 'గ్రూప్ అడ్మిన్' పాలన

**హైద్రాబాద్, 26 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

చట్టమా? లేక చీకటి అనధికార రాజ్యాంగమా? పోలీస్ స్టేషన్‌లో చట్టమే మాట్లాడాలి. కానీ నేడు అక్కడ మాట చెప్పేది చట్టం కాదుఁ వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ అన్న తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఏ రాజ్యాంగంలో ఉంది ఈ వ్యవస్థ? ఏ పోలీస్ మాన్యువల్‌లో రాసి ఉంది? ఏ ప్రభుత్వ ఉత్తర్వుతో రిపోర్టర్లకు పోలీస్ స్టేషన్ సమాచారంపై నియంత్రణ హక్కులు ఇచ్చారు? జవాబు ఒక్కటేఎక్కడా లేదు. అయినప్పటికీ, పోలీస్ స్టేషన్లలో ఒక ప్రమాదకరమైన అనధికార పాలనా వ్యవస్థ బహిరంగంగానే కొనసాగుతోందన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగే నేర ఘటనలు, ఫిర్యాదులు, అరెస్టులు, శాంతిభద్రతల వివరాలుఇవన్నీ అధికారికంగా ఎస్‌హెచ్‌ఓ నిర్ణయించాల్సిన అంశాలు. కానీ వాస్తవంగా మాత్రం ఫిర్యాదు నమోదు కాకముందే సమాచారం గ్రూప్‌లో లీక్ అవుతోంది. అరెస్టు జరగకముందే ప్రచారం జరుగుతోంది. బాధితుల వ్యక్తిగత వివరాలు బహిర్గతమవుతున్నాయి. ఇవన్నీ ఎవరి అనుమతితో జరుగుతున్నాయన్న ప్రశ్నలకు సమాధానాలు కనిపించడం లేదు. పోలీస్ అధికారుల నియంత్రణలో లేని వాట్సాప్ గ్రూప్‌లలో, పోలీసులకన్నా కొందరు రిపోర్టర్ల మాటే చట్టంగా మారుతోందన్న విమర్శలు గంభీరంగా వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితిలో పోలీస్ అధికారి వ్యవస్థను నడుపుతున్నాడా? లేక వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ ఆదేశాలను అమలు చేస్తున్నాడా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది మీడియాపోలీస్ సమన్వయం కాదుఁ పోలీస్ వ్యవస్థపై మౌన కబ్జా అన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నేర విచారణలపై నేరమే జరుగుతోందా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిందితులకు ముందస్తు సమాచారం చేరితే దాన్ని ఏమంటారు? కేసు వివరాలు బయటకు వస్తే దాన్ని ఏమంటారు? బాధితుల గోప్యత భంగం అయితే దానికి బాధ్యత ఎవరిది? ఇవి చిన్న పొరపాట్లు కావని, ఇవి నేర విచారణ వ్యవస్థనే దెబ్బతీసే తీవ్రమైన అంశాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గ్రూప్ అడ్మిన్ హోదా ఒక రిపోర్టర్‌కు అధికార వ్యవస్థపై ప్రభావం చూపించే ఆయుధంగా మారుతోందన్న ఆరోపణలు నిర్లక్ష్యం చేయలేనివిగా మారాయి. సమాచార సేకరణ పేరుతో జరుగుతున్న ఈ జోక్యం పోలీస్ వ్యవస్థను లోపల నుంచే కుళ్లగొడుతోందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. జర్నలిజం అంటే ప్రశ్నించడం. కానీ ఇక్కడ జరుగుతున్నది ప్రశ్న కాదుఁ నిర్ణయం. ఎవరి వార్త వెళ్తుంది? ఎవరి వార్త ఆపేస్తారు? ఎవరికీ సమాచారం ముందుగా ఇవ్వాలి? ఎవరికీ ఇవ్వకూడదు? ఇవి రిపోర్టర్ బాధ్యతలు కావు. ఇవి అధికార వ్యవస్థ పరిధిలోని విషయాలు. ఈ హద్దులు దాటినప్పుడు జర్నలిజం తన విశ్వసనీయతను తానే తాకట్టు పెడుతోంది. అదే సమయంలో పోలీస్ శాఖ ప్రతిష్ఠ కూడా తీవ్రంగా దెబ్బతింటోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీస్ స్టేషన్ అంతర్గత సమాచారం బాహ్య వ్యక్తుల చేతుల్లో ఉండటం అంటే అది కేవలం క్రమశిక్షణ లోపం కాదుఁ అది స్పష్టమైన భద్రతా వైఫల్యం. ఇది వ్యక్తిగత తప్పిదం కాదుఁ వ్యవస్థాత్మక వైఫల్యం. ఇలాంటి అనధికార గ్రూప్ సంస్కృతి కొనసాగితే రేపు కేసులే కాదుఁ ప్రాణాలకూ ముప్పు ఏర్పడే పరిస్థితి తలెత్తవచ్చన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ మొత్తం వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి రాలేదా? లేక తెలిసీ మౌనంగా ఉన్నారా? అన్న ప్రశ్నలు కూడా బలంగా వినిపిస్తున్నాయి. మౌనం కూడా ఒక నిర్ణయమే. ఆ మౌనం ఈ అనధికార పాలనకు




మౌన అనుమతిగా మారుతోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఈ పరిస్థితికి బ్రేక్ వేయాల్సిన అవసరం ఉందన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది. పోలీస్ స్టేషన్ వాట్సాప్ గ్రూప్‌లు పూర్తిగా అధికారుల నియంత్రణలోనే ఉండాలి. అడ్మిన్ హక్కులు కేవలం అధికారిక హోదా కలిగిన పోలీస్ అధికారులకే పరిమితం చేయాలి. బాహ్య వ్యక్తులకుఎంత పెద్ద రిపోర్టర్ అయినాపోలీస్ వ్యవస్థపై ఆధిపత్యం ఉండకూడదు.

**ఇది మీడియాపై దాడి కాదు..–ఇది పోలీస్ వ్యవస్థను రక్షించే చర్య**

సమాచారం ప్రజలకు చేరాలి. కానీ అదే సమాచారం అధికార వ్యవస్థను నియంత్రించే స్థాయికి మారితేఅది ప్రజాస్వామ్యానికి విషం. పోలీస్ స్టేషన్లలో రిపోర్టర్ల 'గ్రూప్ అడ్మిన్' సంస్కృతి కొనసాగితే రేపు చట్టం కాదుఁ వాట్సాప్ అడ్మిన్ పాలన సాగుతుందన్న హెచ్చరికగా ఈ పరిణామాన్ని చూడాల్సిందే. ఇప్పుడైనా ఉన్నతాధికారులు మేల్కొనాల్సిన సమయం ఆసన్నమైంది.

# తెలంగాణలో ఘనంగా రిపబ్లిక్ డే వేడుకలు..

**జాతీయ జెండా ఎగరేసిన గవర్నర్**

**తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు**

**సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జెండా ఆవిష్కరించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ**

**కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం, మంత్రులు, స్పీకర్**

**అసెంబ్లీ, మండలి, సచివాలయంలోనూ రిపబ్లిక్ డే సంబరాలు**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ వ్యాప్తంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అధికారిక కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరించారు. ఈ వేడుకలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్ బాబు, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి హాజరయ్యారు. అంతకుముందు తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలిలో ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. రాష్ట్ర సచివాలయంతో పాటు జిల్లా కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లోనూ రిపబ్లిక్ డే వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమరయోధులను, రాజ్యాంగ నిర్మాతలను స్మరించుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో దేశభక్తి వాతావరణం నెలకొంది.



# బీజేపీకి అర్ధరాత్రి రహస్య గుడ్‌బై?

**ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ ముసుగులో ప్రజాస్వామ్యంపై దాడి**

**28న గులాబీ కండువా కప్పుకోనున్న రమేష్ రాజకీయం వెనుక అసలు కారణమిదేనా?**



**హైద్రాబాద్, 26 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయాల్సిన బీజేపీ ప్రభుత్వం, ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ పేరుతో ప్రజాస్వామ్య విలువలనే దెబ్బతీస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఓటర్ల జాబితాలో అక్రమ మార్పులు, నకిలీ పేర్ల చేర్పు, నిజమైన ఓటర్ల తొలగింపు వంటి చర్యలతో ఎన్నికల ప్రక్రియనే అపహాస్యం చేస్తున్నారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. తెలంగాణలో తాజాగా చోటుచేసుకుంటున్న పరిణామాలు ఈ ఆరోపణలకు మరింత బలం చేకూరుస్తున్నాయి. బీజేపీ నేత రమేష్ రాజకీయం త్వరలోనే పార్టీకి గుడ్‌బై చెప్పనున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ వ్యవహారంలో పార్టీ అనుసరిస్తున్న విధానాలపై అసంతృప్తితోనే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారని సమాచారం. ఇప్పటికే ఈ నెల 28వ తేదీన బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు రమేష్ సన్నాహాలు చేస్తున్నారన్న వార్తలు వెలుగులోకి వచ్చాయి. 2024 ఎన్నికల సమయంలో బీజేపీ నేతలు ఓటర్ల జాబితాలో చేసిన అక్రమాలపై ఆయన బహిరంగంగానే అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభమైన ఓటు హక్కును రాజకీయ లాభాల కోసం దుర్వినియోగం చేయడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించినట్లు సమాచారం. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎన్నికల ముందు ఓటర్ జాబితాల్లో అనుమానాస్పద మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతమని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఓటర్ లిస్ట్‌లతో చెలగాటం ఆడటం ద్వారా అధికారంలో నిలవాలని చూడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో తెలంగాణ రాజకీయాల్లో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా రమేష్ వంటి నాయకుల పార్టీ మార్పులు బీజేపీ అంతర్గత అసంతృప్తికి నిదర్శనమని చెబుతున్నారు. ఓటర్ జాబితాల వ్యవహారంపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని, ఎన్నికల కమిషన్ తక్షణమే స్పందించాలని ప్రజాస్వామ్య వాదులు డిమాండ్ చేస్తున్నారు. మొత్తంగా, ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ పేరుతో జరుగుతున్న అక్రమాలు, నేతల పార్టీ మార్పులు తెలంగాణ రాజకీయాలను మరింత వేడెక్కిస్తున్నాయి. రానున్న రోజుల్లో ఈ అంశం రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపుగా మారే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.